ఈనాటి
# తెలుగోడు
PRGI-NO-APTEL/25/A2739
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com
సంపుటి-1 | సంచిక - 117 | సోమవారం 26 జనవరి 2026 | పేజీలు - 8 వెల - రూ.. 5
Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati

Ph:8368102842
నాశా క్లినిక్
డా.భానుప్రకాష్ MBBS
సంప్రదించు వేళలు: ఉ.7.30 నుంచి 8.30 వరకు
సా.4 గం.నుంచి రాత్రి.8.30 వరకు
డా.నిహారిక BHMS
సంప్రదించు వేళలు:
ఉ.9 గం. నుంచి సా.5 గం. వరకు
Ph:9704461510
మా మెడికల్స్
ఎమ్మార్వో ఆఫీస్ ఎదురుగా ఓ.డి.చెరువు


**18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోండి**

## యువతకు మోడీ పిలుపు



**న్యూ ఢిల్లీ (తెలుగోడు), జనవరి 25 :**

భారతదేశం వ్యాప్తంగా ఇవాళ జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా జరుపుకుంటోంది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యువతను ప్రత్యేకంగా కేంద్రబిందువుగా ఉంచి, ఓటింగ్ ప్రాముఖ్యతపై స్పష్టమైన పిలుపు ఇచ్చారు. 18 ఏళ్లు పూర్తి అయిన వెంటనే ప్రతి యువత ఓటర్‌గా రిజిస్టర్ అవ్వాలని ఆయన సూచించారు. ప్రధాని మోదీ చెప్పారు, ఓటర్?గా ఉండటం కేవలం రాజ్యాంగ హక్కు మాత్రమే కాదు, దేశ భవిష్యత్తులో ప్రతి పౌరుడికి ముఖ్య బాధ్యత అని.ఈ సందేశాన్ని మన్ కీ బాత్ 130వ ఎపిసోడ్‌లో ప్రసారం చేశారు. ప్రసంగంలో మోదీయువతకు చెప్పారు, ఓటర్లు తమ ఊరు, గ్రామం లేదా నగరంలో సామూహికంగా శుభాకాంక్షలు పంచుకోవడం ద్వారా ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయవచ్చని. ప్రతీ యువ ఓటర్ తమ సొంత ప్రాంతంలో ప్రజాస్వామ్య చైతన్యాన్ని పెంపొందించే విధంగా కృషి చేయవలసిందని మోదీ సూచించారు.ప్రధాని మోదీ ఎక్స్ (ట్విట్టర్) ద్వారా కూడా జాతీయ ఓటర్ల దినోత్సవ శుభాకాంక్షలు తెలియచేశారు. (మిగతా 2లో)



# విస్తరణ దిశగా అమరావతి

- రాజధాని రెండోదశ విస్తరణకు అధికారికి ప్రణాళిక...
- 7గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్ కొనసాగింపు..
- 43 గ్రామాలకు మందస్తు ప్లాన్..
- భవిష్యత్ అవసరాల దృష్ట్యా వ్యూహాత్మక అభివృద్ధిపై ఫోకస్..
- ప్రధాన రహదారుల విస్తరణ..

**అమరావతి (తెలుగోడు), జనవరి 25 :**

అమరావతి కేంద్రంగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాజధాని రెండో దశ విస్తరణలో భాగంగా 709.6 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణానికి మాస్టర్‌ప్లాన్ రూపొందించేందుకు తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. భవిష్యత్‌లో జనాభా పెరుగుదల, పరిపాలనా అవసరాలు, పారిశ్రామిక అభివృద్ధి, అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ విస్తృత ప్రణాళికలకు శ్రీకారం చుట్టింది.ఇప్పటికే మొదటి దశ రాజధాని నిర్మాణంలో కీలక మౌలిక వసతుల అభివృద్ధి కొనసాగుతున్న నేపథ్యంలో, రెండో దశ విస్తరణను కూడా ప్లాన్డ్ అర్బన్ డెవలప్ మెంట్ మోడల్‌గా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో అమరావతిని ఆనుకుని ఉన్న ప్రాంతాలను ముందస్తు వ్యూహంతో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా మాస్టర్‌ప్లాన్ రూపకల్పన జరుగుతోంది. రెండో దశ విస్తరణలో భాగంగా మొత్తం 50 గ్రామాలను గుర్తించారు. మిగతా 2లో

**మాజీ సిఎం జగన్ భూ సంస్కరణలకు**

# ప్రపంచ ముద్ర

- చంద్రబాబు అబద్ధాల రాజకీయానికి అంతర్జాతీయ చెక్..
- జగన్ హయాంలో సంస్కరించిన ఏపీ ల్యాండ్ టైటిలింగ్ దేశానికే ఆదర్శం..
- ఐఎంఎఫ్ ఎండీ గీతా గోపీనాథ్ వ్యాఖ్యలే నిదర్శనం..
- పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి...



**పుట్టపర్తి (తెలుగోడు), జనవరి 25 :**

వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ దావోస్ వేదికగా వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో తీసుకొచ్చిన భూ సంస్కరణలకు ప్రపంచ స్థాయి గుర్తింపు లభించిందని పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఏపీ క్లీన్ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తోందని ఐఎంఎఫ్ (ఇంటర్నేషనల్ మానటరీ ఫండ్) మేనేజింగ్ డైరెక్టర్ గీతా గోపీనాథ్ స్పష్టం చేయడంతో, ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు చేసిన విష ప్రచారం పూర్తిగా అబద్ధమని రాష్ట్ర ప్రజానికానికి అర్థం అయ్యిందని తెలిపారు.భారత ఆర్థిక వ్యవస్థపై జరిగిన అంతర్జాతీయ చర్చాగోష్టిలో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌తో పాటు పలువురు ప్రముఖుల సమక్షంలో గీతా గోపీనాథ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాలను కూడా ఆలోచింప జేశాయన్నారు.భూ హక్కులకు స్పష్టత తీసుకొచ్చే ఈ చట్టం వెనుక వైఎస్ జగన్ కృషి (మిగతా 2లో)

## ప్రముఖులకు పద్మ పురస్కారాలు



**న్యూ ఢిల్లీ (తెలుగోడు), జనవరి 25 :**

జనవరి 26, 2026, గణతంత్ర దినోత్సవ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం పద్మ పురస్కారాలను ప్రకటించింది. ఈ ఏడాది 45 మంది దేశసేవకులు, పరిశోధకులు, కళాకారులు, వ్యవసాయ, వైద్య, సాంకేతిక రంగాల్లో విశిష్ట సేవలు అందించినవారు పద్మశ్రీ అవార్డుకు ఎంపికయ్యారు. పద్మశ్రీ అవార్డు భారత ప్రభుత్వ ప్రధాన పురస్కారాలలో ఒకటిగా నిలుస్తుంది. వివిధ రంగాల్లో జాతీయ స్థాయిలో విశేష సేవలు అందించిన వ్యక్తులను గుర్తించి, వారికి ఆ గౌరవాన్ని ప్రసాదించడం దీని ముఖ్య ఉద్దేశ్యం. ప్రతి అవార్డు గ్రహీత వారి రంగంలో ప్రతిభ, దేశాభిమానాన్ని, సమాజ సేవా దృక్పథాన్ని ప్రతిబింబిస్తారు.తెలంగాణకు చెందిన మామిడి రామారెడ్డి పాడి, పశుసంవర్ధక రంగంలో చేసిన విశేష సేవలతో పద్మశ్రీ అవార్డుకు ఎంపికయ్యారు. తమిళనాడులోని నటేశన్ మరియు హైదరాబాద్ లోని సీసీఎంబీలో పనిచేస్తున్న డాక్టర్ కుమారస్వామి తంగరాజ్ జెనెటిక్ పరిశోధనలలో చేసిన కృషి కోసం గుర్తింపు పొందారు. (మిగతా 2లో)

# పేరుకే పెద్ద బడి



- ప్రతి ఏటా తగ్గిపోతున్న విద్యార్థుల సంఖ్య..
- అన్నీ ఉచితమైనా పెరగని విద్యార్థుల చేరికలు..
- గతంలో వెయ్యికి పైగా వుండగా ప్రస్తుతం 320 మంది విద్యార్థులే...
- విద్యార్థుల చేరికలకోసం చర్యలు శూన్యం..
- సంబంధిత అధికారుల నిర్లక్ష్యమే కారణం...

**నల్లమాడ (తెలుగోడు), జనవరి 25 :**

ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తున్నామని, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఉచితంగా అందిస్తున్నామని ప్రభుత్వాలు పదేపదే ప్రకటిస్తున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. శ్రీ సత్యసాయి జిల్లా, మండల కేంద్రమైన నల్లమాడ లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దీనికి స్పష్టమైన ఉదాహరణగా నిలుస్తోంది. ఒకప్పుడు విద్యార్థులతో కిటకిటలాడిన ఈ పాఠశాల విద్యార్థుల సంఖ్య ప్రతి ఏటా దిగజారుతూనే ఉంది.గతంలో సుమారు 1200 మంది కి పైగా హాజరయ్యే విద్యార్థులున్న ఈ పాఠశాలలో ప్రస్తుతం కేవలం 320 మంది మాత్రమే నమోదు ఉన్నారు. అందులోనూ రోజువారీ హాజరు 260--270 మందిని దాటడం లేదని తెలుస్తోంది. అప్పట్లో ఎటువంటి ఉచిత పథకాలు లేకపోయినా ప్రభుత్వ బడులపై ఉన్న నమ్మకం నేడు ఎందుకు తగ్గిపోయిందన్నది ప్రశ్నార్థకం. పాఠశాలలో అత్యధిక తరగతి గదులు, విశాలమైన క్రీడా ప్రాంగణం, అవసరమైనంత ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నప్పటికీ విద్యార్థుల సంఖ్య మాత్రం ఏటేటా తగ్గిపోతోంది. విద్యార్థులకు యూనిఫామ్, షూస్, పుస్తకాలు, నోట్‌బుక్స్ లాంటివి అన్ని ఉచితంగా (మిగతా 2లో)

# మహిళలే అజెండా




- మహిళలకు ప్రాధాన్యతనిచ్చే అజెండాతో బడ్జెట్..
- ఆడబిడ్డనిధి పథకం అమలుకు చర్యలు..
- సంక్షేమంతో పాటు అభివృద్ధికీ ప్రాధాన్యత దిశగా..
- ఈనెల 28న కేబినెట్ భేటీలో అధికారిక ముద్ర..
- విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాలకూ ప్రాధాన్యత..
- ఫిబ్రవరి 11నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు..

**అమరావతి (తెలుగోడు), జనవరి 25 :**

ఫిబ్రవరి 11 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలి పూర్తి స్థాయి వార్షిక బడ్జెట్ కు సిద్ధమైంది. ఫిబ్రవరి 11 నుంచి ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. తొలి రోజున గవర్నర్ ప్రసంగంతో సమావేశాలు మొదలవుతాయి. అనంతరం బీఏసీ సమావేశం జరగనుండగా, సమావేశాల అజెండా, పని దినాల సంఖ్యపై నిర్ణయం తీసుకోనున్నారు. ఈ నెల 28న జరిగే కేబినెట్ భేటీలో సమావేశాలపై అధికారిక ముద్ర పడనుంది.ఈ బడ్జెటలో మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు సమాచారం. 'ఆడబిడ్డ నిధి' పథకం కింద 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు గల అర్హులైన మహిళలందరికీ ప్రతి నెల రూ.1,500 చొప్పున అందించేలా ప్రభుత్వం కీలక ప్రకటన చేసే అవకాశం ఉంది. మహిళలకు స్వావలంబన కల్పించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఫిబ్రవరి 14న 2025--26 ఆర్థిక సంవత్సరానికి (మిగతా 2లో)

## రథ సప్తమి వేళ తిరుమలలో దివ్య వైభవం




**సప్త వాహనాలపై శ్రీ మలయప్పస్వామి విహారం**

- చిన్న బ్రహ్మోత్సవంలా ఘనంగా రథసప్తమి..
- పది టన్నుల పుష్పాలు, విద్యుత్ దీపాల శోభతో తిరుమల వెలుగులు..

వివరాలు. 2లో

# ప్రజాస్వామ్య యుద్ధం



**చెన్నై (తెలుగోడు), జనవరి 25 :**


తమిళనాడులో వచ్చే అసెంబ్లీ ఎన్నికలు కేవలం రాజకీయ పోరు మాత్రమే కాకుండా, ప్రజా స్వామ్యాన్ని కాపాడే యుద్ధం అని టీవీకే అధ్యక్షుడు విజయ్ తెలిపారు. మహాబలిపురంలో ఆదివారం జరిగిన పార్టీ స్ట్రాటజీ సమావేశంలో ఆయన ఈ శక్తివంతమైన వ్యాఖ్యలు చేశారు. సుమారు 3,000 మంది రాష్ట్ర, జిల్లా స్థాయి పార్టీ కార్యకర్తలు హాజరైన ఈ సమావేశంలో, విజయ్ పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి, "ఈ యుద్ధంలో మీ అందరు నా కమాండోలు. ప్రతి ఓటును పరిరక్షించాలి, ప్రతి ఒక్క ఓటరును కలవండి" అని ఆకట్టుకున్నారు.విజయ్ ఈ (మిగతా 2లో)

# అనంత జల సంకల్పానికి మోడీ ఫిదా

- కరువు నేల అనంత.. దేశానికే ఆదర్శం..
- కరువుకాటకాల్లోనూ కుంగిపోని ప్రజా సంకల్పం..
- వర్షాభావానికి ప్రజా ఉద్యమంతో సమాధానం..
- చెరువుల పునరుద్ధరణతో నీటి భద్రత దిశగా అడుగులు..
- మోడీ ప్రశంసలపై సిఎం చంద్రబాబు కృతజ్ఞతలు..
- స్వర్ణాంధ్ర విజన్‌కు ప్రధాని మోడీ మాటల బలం...

**న్యూ ఢిల్లీ (తెలుగోడు), జనవరి 25 :**

కరవుతో విలవిల్లాడే ప్రాంతాల్లో కూడా ప్రజల సంకల్పం ఉంటే విప్లవాత్మక మార్పు సాధ్యమని ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి చాటిచెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా ప్రజలు నీటి కొరతను ఎదుర్కొనేందుకు చేపట్టిన స్వచ్ఛంద ప్రయత్నాలు దేశానికే మార్గదర్శకంగా నిలుస్తున్నాయని ప్రశంసించారు. ఆదివారం నిర్వహించిన మన్ కీ బాత్ 130వ ఎపిసోడ్‌లో అనంతపురం ప్రజల జలసంరక్షణ ఉద్యమాన్ని ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించడం రాజకీయంగా కూడా ప్రాధాన్యత సంతరించుకుంది.వర్షపాతం తీవ్రంగా తగ్గిపోవడంతో అనంతపురం ప్రాంతం ఎన్నో దశాబ్దాలుగా నీటి ఎద్దడితో అల్లాడుతోందని ప్రధాని గుర్తు చేశారు. అయినప్పటికీ ప్రభుత్వం మీద మాత్రమే ఆధారపడకుండా, అక్కడి ప్రజలు స్వయంగా ముందుకు వచ్చి జలవనరుల పునరుద్ధరణకు నడుం బిగించారని తెలిపారు. గ్రామస్థుల భాగస్వామ్యంతో సాగుతున్న ఈ ఉద్యమం ప్రజాస్వామ్యంలో ప్రజల శక్తిని స్పష్టంగా చూపిస్తోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఇప్పటివరకు పది కంటే ఎక్కువ చెరువులు, కుంటలను పునరుద్ధరించడంతో పాటు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే చర్యలు చేపట్టినట్లు ప్రధాని వెల్లడించారు. ఏడు వేలకుపైగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కూడా అనంతపురం మిగతా... 2లో



# విస్తరణ దిశగా అమరావతి

(మొదటి పేజీ (తరువాయి)

ఇందులో ప్రస్తుతం లాండ్ పూలింగ్ జరుగుతున్న 7 గ్రామాలు ఉండగా, మిగిలిన 43 గ్రామాల్లో తక్షణ భూసేకరణకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అయితే, భవిష్యత్ అవసరాల కోసం ఆ గ్రామాలన్నింటికీ ముందస్తుగా స్ట్రక్చర్ ప్లాన్ సిద్ధం చేయనున్నారు.

ప్రస్తుతం రెండో విడత లాండ్ పూలింగ్ కొనసాగుతున్న 7 గ్రామాల విస్తీర్ణం 20,494 ఎకరాలు, అంటే 82.9 చదరపు కిలోమీటర్లుగా ఉంది. ఈ ప్రాంతంలో ఇప్పటికే భూములు ఇచ్చిన రైతులకు ప్లాట్ల కేటాయింపు ప్రక్రియ కొనసాగుతోంది. రైతుల ప్రయోజనాలను పరిరక్షిస్తూ, రాజధాని అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్లాలన్న దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

మిగిలిన 43 గ్రామాల్లోని భూముల విస్తీర్ణం 1,54,853 ఎకరాలు 43 సెంట్లుగా అంచనా వేయగా, మొత్తంగా రెండో దశలో 1,75,347 ఎకరాలకు మాస్టర్‌ప్లాన్ సిద్ధం అవుతోంది. ఈ 43 గ్రామాల్లో గుంటూరు జిల్లాలో 29 గ్రామాలు, పల్నాడు జిల్లాలో 14 గ్రామాలు ఉన్నట్లు సమాచారం.

రెండో దశ మాస్టర్‌ప్లాన్ రూపకల్పన బాధ్యతను సీఆర్డీఏకు అప్పగించగా, ఇందుకు ఆరు నెలల గడువును నిర్దేశించారు. రెండో విడత లాండ్ పూలింగ్ జరుగుతున్న 7 గ్రామాలకు సంబంధించి వివరణాత్మక మాస్టర్‌ప్లాన్, మిగిలిన 43 గ్రామాలకు స్ట్రక్చర్--ఇండికేటివ్ ప్లాన్ రూపొందించనున్నారు. దీని ద్వారా భవిష్యత్తులో అవసరమైతే దశలవారీగా అభివృద్ధి చేపట్టే వీలుంటుంది. ప్రస్తుతం భూసమీకరణ జరుగుతున్న ప్రాంతాల్లో స్మార్ట్ సిటీ, స్మార్ట్ ఇండస్ట్రీస్, ఐటీ హబ్?లు, లాజిస్టిక్స్ పార్కులు వంటి అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. అంతేకాదు, ఈ ప్రాంతంలో అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు అనేక భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులు రాబోయే అవకాశాలు ఉన్నట్లు అధికారులు సూచిస్తున్నారు.

అమరావతిలో ఇప్పటికే అభివృద్ధి చేస్తున్న ప్రధాన రహదారులను రెండో దశ విస్తరణ ప్రాంతాలకు పొడిగించనున్నారు. కొన్ని కీలక రహదారులను అవుటర్ రింగ్ రోడ్డుతో అనుసంధానం చేయాలన్న ప్రతిపాదన కూడా మాస్టర్‌ప్లాన్‌లో చోటు దక్కే అవకాశం ఉంది. దీని ద్వారా రాజధానితో పాటు పరిసర ప్రాంతాలకు వేగవంతమైన రవాణా సౌకర్యం అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం.

మొత్తంగా చూస్తే, అమరావతిని కేవలం పరిపాలనా రాజధానిగా కాకుండా, భవిష్యత్ అవసరాలకు సిద్ధమైన అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఈ రెండో దశ మాస్టర్‌ప్లాన్ స్పష్టంగా చెబుతోంది.

# జగన్ భూసంస్కరణలకు ప్రపంచ ముద్ర

(మొదటి పేజీ (తరువాయి)

కీలకమని ఆమె స్పష్టం చేయడం ద్వారా, కూటమి ప్రభుత్వం చేసిన అబద్ధాల ప్రచారానికి అంతర్జాతీయ స్థాయిలో చెక్ పడిందన్నారు.ఎన్నికల ముందు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను భూములు లాగేసే చట్టమని చిత్రీకరించి ప్రజల్లో భయాందోళనలు సృష్టించిన చంద్రబాబు, ఇప్పుడు అదే చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం దావోస్ వేదికగా దేశానికి ఆదర్శమని చెప్పడం గమనిస్తే జగన్ ముందుచూపు ప్రతి ఒక్కరికీ అర్థమవుతోందన్నారు. ప్రపంచ ప్రముఖుల సమక్షంలో కేంద్ర ప్రభుత్వం ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను ప్రశంసించడం తమ నాయకుడు జగన్ పనితీరును హర్షించక తప్పదన్నారు. ఇది వైఎస్సార్సీపీకి మాత్రమే కాదు, భూ సమస్యలతో ఏళ్ల తరబడి ఇబ్బంది పడిన కోట్లాది రైతులు, పేదలకు లభించిన నైతిక విజయం అని స్పష్టం చేశారు.ల్యాండ్ రీ సర్వే తన విజన్ అంటూ చంద్రబాబు ఇప్పుడు చెప్పుకుంటున్నా, వాస్తవానికి ఈ భూ సంస్కరణలకు బీజం వైఎస్ జగన్ ప్రజాసంకల్ప యాత్రలోనే పడిందని దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తెలిపారు. టైటిల్ లీడ్‌ల లోపాలు, పాస్‌బుక్స్ తప్పిదాలు, భూ వివాదాలతో ప్రజలు ఎదుర్కొన్న సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం చూపాలన్న దృఢ సంకల్పంతోనే ఈ చట్టాన్ని అమలు అప్పట్లో చేయడం జరిగిందన్నారు.

ప్రపంచ వేదికపై కేంద్రం, అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను దేశానికే ఆదర్శంగా ప్రకటించడం, చంద్రబాబు అబద్ధాల రాజకీయానికి తుది తీర్పుగా మారిందని ఆయన వ్యాఖ్యానించారు. ఇది రాష్ట్ర ప్రజలకు దక్కిన చారిత్రక విజయమని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట స్పష్టం చేశారు.

# క్యారెక్టర్, కెపాసిటీ, కాండక్ట్..వాజ్‌పేయి



విజయవాడ (తెలుగోడు ), జనవరి 25 :

మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి విశిష్ట నాయకత్వ గుణాలను గుర్తిస్తూ, మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు ఆదివారం వాజ్‌పేయి విగ్రహాన్ని విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, స్థానిక ఎమ్మెల్యే సుజనా చౌదరి పాల్గొన్నారు.వేదికపై ప్రసంగిస్తూ వెంకయ్యనాయుడు వాజ్‌పేయి "నేషన్ ఫస్ట్, పార్టీ నెక్స్ట్, సెల్ఫ్ లాస్ట్" సిద్ధాంతాన్ని నమ్మి, సత్యనిష్ఠ నాయకుడిగా ఎల్లప్పుడూ ప్రజా సేవలో మునిగేవాడని గుర్తు చేశారు. మూడు సార్లు ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడానికి వాజ్‌పేయి, అద్వానీ కీలక పాత్ర పోషించారని చెప్పారు.తన వ్యక్తిగత అనుభవాన్ని వెల్లడిస్తూ, వీధి బడిలో చదివిన తాను ఉప రాష్ట్రపతి అయ్యానని, మాతృభాషలో చదివినవాళ్లే రాష్ట్రపతి అయ్యారని వివరించారు. భాషా ప్రేమతో వ్యక్తిగత, జాతీయ అభివృద్ధిని సాధించవచ్చని, ప్రతి ప్రభుత్వ ఉద్యోగి అవినీతికి దూరంగా ఉండాలని హితవు పలికారు. పేదరిక నిర్మూలన ద్వారా దేశాభివృద్ధి సాధ్యమని అన్నారు.వెంకయ్యనాయుడు, అమెరికా అధ్యక్షుడి వ్యాఖ్యలకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని, కానీ బలంగా, ధైర్యంగా ఉంటే సమాధానం చెప్పడం అవసరమని స్పష్టం చేశారు. పార్లమెంట్, అసెంబ్లీలో గౌరవపూర్వక, అర్థవంతమైన చర్చలు జరగాలని, శాసన సభ్యులు ప్రజల ముందు గౌరవనీయంగా ప్రవర్తించాలని పిలుపునిచ్చారు. అంతేకాక, ఎన్నికల సవరణలో రాజకీయ పార్టీ కార్యకర్తలు నిబద్ధత చూపలేదని, ఇప్పుడు ఎన్నికల కమిషన్ ఆ బాధ్యత వహిస్తున్నదని పేర్కొన్నారు. "మన బతుకుపై కాదు, మన పనిపై దృష్టి పెట్టాలి" అని తనదైన శైలిలో వ్యాఖ్యానించారు.వాజ్‌పేయి సేవలను ఆదర్శంగా తీసుకొని, పౌరులకి న్యాయంగా, బాధ్యతగా సేవ చేయాలి అని వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు.

## నాందేడ్ తఖ్త్ సచ్ ఖండ్


# గురుద్వారాలో పవన్‌కళ్యాన్ ప్రార్థనలు



ముంబాయి (తెలుగోడు ), జనవరి 25 :

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదివారం మహారాష్ట్ర పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌తో కలిసి నాందేడ్‌లోని తఖ్త్ సచ్ ఖండ్ గురుద్వారాను సందర్శించారు. సిక్కుల 10వ మత గురువు శ్రీ గురు గోవింద్ సింగ్ సాయిబా సమాధి మందిరాన్ని దర్శించుకున్న పవన్ కళ్యాణ్ అక్కడ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. పవిత్ర చాదర్?ను సమర్పించి నమస్కరించారు.సిక్కుల ఐదు అత్యున్నత పీఠాల్లో ఒకటైన హజూర్ సాహిబాలో నిర్వహించిన ప్రార్థనల్లో పాల్గొన్న సందర్భంగా పవన్ కళ్యాణ్ సిక్కు సంప్రదాయ తలపాగా ధరించి సంప్రదాయబద్ధంగా కనిపించారు. గురుద్వారా ఛైర్మన్ డాక్టర్ విజయ్ సత్పాల్ సింగ్ ఆధ్వర్యంలో సిక్కు మత పెద్దలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. గురుద్వారా జ్ఞాపికతో పాటు సిక్కులు ధరించే పవిత్ర ఆయుధం కిర్పాన్‌ను బహూకరించారు.ప్రధాన మందిరంలో ప్రార్థనల అనంతరం గురుద్వారా గ్రంథీలు పవన్ కళ్యాణ్, దేవేంద్ర ఫడ్నవిస్?లకు పవిత్ర వస్త్రాన్ని అందించారు. సమాధి మందిరంలో ప్రదక్షిణ పూర్తి చేసిన అనంతరం గురుద్వారా ఎదుట అత్యంత పవిత్రంగా భావించే నిషాన్ సాహిబ్ ధ్వజానికి మొక్కారు. దర్శనం ముగిసిన తరువాత గురుద్వారా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ డొనేషన్ మెషీన్‌ను పవన్ కళ్యాణ్ ప్రారంభించారు.శ్రీ గురు తేగ్ బహదూర్ సింగ్ 350వ షాహిదీ సమాగమంలో పాల్గొనేందుకు నాందేడ్‌కు వచ్చిన పవన్ కళ్యాణ్, అనంతరం మాట్లాడుతూ శ్రీ గురు తేగ్ బహదూర్ సింగ్ దేశమంతటికీ స్ఫూర్తినిచ్చిన మహనీయుడని పేర్కొన్నారు. ఆయన త్యాగం భవిష్యత్ తరాలకు మార్గదర్శకమని, అలాంటి గురువు షాహిదీ సమాగమంలో పాల్గొనడం గౌరవమని తెలిపారు..

# పేరుకే పెద్దబడి



(మొదటి పేజీ (తరువాయి)

ఉచితంగా అందించడంతో పాటు 'తల్లికి వందనం' వంటి ప్రోత్సాహక పథకాలు అమలు చేస్తున్నా ఫలితం కనిపించడం లేదు. దీంతో అన్ని సౌకర్యాలున్నా పిల్లలు బడికి రావడం లేదంటే లోపం ఎక్కడో ఉందనే భావన కలగక తప్పదు.ఇక మరింత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే నల్లమాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీఎం శ్రీ పథకానికి ఎంపిక కావడంతో పాఠశాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ద్వారా భారీగా నిధులు అందుతున్నాయి. ఈ నిధులతో విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మరిన్ని మౌలిక వసతులు, ఆధునిక తరగతి గదులు, డిజిటల్ విద్యా సదుపాయాలు, ల్యాబ్‌లు, క్రీడా వసతులు ఏర్పాటు చేసే అవకాశం ఉన్నప్పటికీ, వాటి ప్రభావం విద్యార్థుల సంఖ్య పెరుగుదలలో మాత్రం కనిపించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. నిధులు రావడం గొప్పే... కానీ పిల్లలు లేకపోతే ఆ నిధుల ప్రయోజనం ఎవరికీ అని విద్యావంతులు ప్రశ్నిస్తున్నారు.మరోవైపు పాఠశాలకు వెళ్తున్నామని చెప్పి ఇంటి నుంచి బయలుదేరిన కొందరు విద్యార్థులు నల్లమాడకు వచ్చి అటూ ఇటూ తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం అవుతోంది. బడిలో ఉంటే మా పిల్లలు సురక్షితంగా ఉంటారు. బడి బయట ఉంటే వాళ్లు దారి తప్పుతున్నారు అంటూ కొందరు తల్లిదండ్రులలో కూడా పలు అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఆ విషయంలో తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా ఉందని, ఉపాధ్యాయులు కూడా ఎటువంటి చర్యలకు పూనుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులను పరిశీలించి, విద్యార్థులకు అందాల్సిన మౌలిక వసతుల్లోని లోపాలను గుర్తించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపాల్సిన బాధ్యత కలిగిన క్లస్టర్ రిసోర్స్ పర్సన్ పర్యవేక్షణ కేవలం ఏడాదికి ఒకటో రెండుసార్లకే పరిమితమవుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే ప్రతి వేసవి సెలవుల్లో గ్రామాల్లో తిరుగుతూ తల్లిదండ్రులకు ప్రభుత్వ విద్యపై అవగాహన కల్పించాల్సిన ఉపాధ్యాయ సిబ్బంది ఈ బాధ్యతను విస్మరించారన్న విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి.

"మా కాలంలో సౌకర్యాలు తక్కువ ఉన్నా బడి అంటే దేవాలయం లాంటిది. ఇప్పుడు అన్ని మౌలిక సౌకర్యాలు ఉన్న బడులున్నా పిల్లలు తగ్గిపోతున్నారు" అని ఓ పూర్వపు విద్యార్థి ఆవేదన వ్యక్తం చేయగా, మరో తల్లిదండ్రులు "ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల భారం భరించలేకపోతున్నాం. కానీ ప్రభుత్వ బడుల్లో నాణ్యతపై నమ్మకం కలగడం లేదు" అంటూ ఆందోళన వ్యక్తం చేశారు.కనీసం వచ్చే విద్యాసంవత్సరానికైనా ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకాన్ని మరింత పెంచి విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది సమిష్టిగా బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉంది. విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోతే కోట్ల రూపాయలతో నిర్మించిన భవనాలు, కోట్ల నిధులు కేవలం కాగితాలకే పరిమితమవుతాయని చెప్పుకోవాల్సిందే...

# రథ సప్తమి వేళ తిరుమలలో దివ్య వైభవం



తిరుమల (తెలుగోడు ), జనవరి 25 :

రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధి భక్తులతో కిటకిటలాడుతోంది. సూర్య జయంతిగా పరిగణించే ఈ అపురూప సందర్భంలో తిరుమలలో రథసప్తమి ఉత్సవాలు చిన్న బ్రహ్మోత్సవంలా అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఏడాది లో ఒకేరోజు స్వామివారు ఏడు వాహనాలపై విహరించే అరుదైన ఘట్టానికి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. నిత్యకైంకర్యాలు ముగిసిన అనంతరం ఉదయం 5.30 గంటలకు శ్రీమలయప్ప స్వామివారు ఆలయం నుంచి వాహన మండపానికి చేరుకున్నారు. అక్కడ విశేష సమర్పణల అనంతరం సూర్యోదయానికి ముందు సర్కారు హారతితో సూర్యప్రభ వాహన సేవ ప్రారంభమైంది. సూర్యోదయ సమయంలో సూర్యప్రభపై స్వామివారి దర్శనం భక్తులకు ఆధ్యాత్మిక పరవశాన్ని కలిగించింది.ఆ తర్వాత స్వామివారు చిన్నశేష, గరుడ, హంస, అశ్వ, గజ వాహనాలపై తిరుమాడ వీధుల్లో ఊరేగి భక్తులకు దివ్య దర్శనం ఇస్తారు. రాత్రి 8 గంటలకు చంద్రప్రభ వాహన సేవతో ఈ సప్తవాహన సేవలు ముగుస్తాయి. ఒకేరోజు జరిగే ఈ ఉపబ్రహ్మోత్సవాలు భక్తుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచే ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తున్నాయి.

స్వామివారి దర్శనం కోసం నిన్న సాయంత్రం నుంచే మాడ వీధుల్లోని గ్యాలరీల్లో భక్తులు వేచి ఉన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా టీటీడీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. అన్నప్రసాదం, పానీయాల పంపిణీతో పాటు భద్రతా చర్యలను కట్టుదిట్టం చేశారు. గ్యాలరీలు, మాడ వీధులు భక్తులతో నిండిపోయాయి.రథసప్తమి వేడుకల నేపథ్యంలో ఆలయ మహద్వారం నుంచి స్వామివారి సన్నిధి వరకు వర్ణరంజిత పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఇందుకోసం సుమారు పది టన్నుల సంప్రదాయ పుష్పాలను వినియోగించారు. స్వామివారు విహరించే తిరువీధుల్లో సకల ఏర్పాట్లూ పూర్తి చేశారు.

# ప్రకృతి వైద్యానికి పదవి కాదు..సేవే లక్ష్యం

## ప్రభుత్వ సలహాదారుగా మంతెన, ఒక్కరూపాయి సదుపాయం కూడా వద్దన్న సంచలన నిర్ణయం



అమరావతి (తెలుగోడు ), జనవరి 25 :

ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు కీలక నిర్ణయం తీసుకున్నారు. యోగా, నాచురోపతి రంగాల్లో ఆయనకు ఉన్న మూడు దశాబ్దాలకు పైగా అనుభవాన్ని వినియోగించుకునే ఉద్దేశంతో ఏపీ ప్రభుత్వం తాజాగా ఆయనను ప్రకృతి వైద్య సలహాదారుగా నియమించింది. ఈ హోదాలో డాక్టర్ మంతెన రెండేళ్ల పాటు కొనసాగనున్నారు.ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు భేటీ అయ్యారు. ప్రకృతి వైద్య రంగంలో ఆయన అందిస్తున్న 35 ఏళ్ల సేవలను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. ప్రభుత్వం బిల్ గేట్స్ ఫౌండేషన్ సహకారంతో అమలు చేస్తున్న సంజీవని ప్రాజెక్ట్ సహా పలు ఆరోగ్య కార్యక్రమాలకు డాక్టర్ మంతెన లాంటి నిపుణుల సలహాలు ఎంతో ఉపయోగపడతాయని సీఎం అభిప్రాయపడ్డారు. యోగా, నాచురోపతి విభాగంలో ప్రభుత్వ సలహాదారుగా బాధ్యతలు స్వీకరించాలని సూచించారు.దీనికి స్పందించిన డాక్టర్ మంతెన... తాను సాధారణంగా హోదాలు, పదవులు తీసుకోకూడదనే నియమాన్ని పెట్టుకున్నానని తెలిపారు. వెనుక ఉండి ప్రభుత్వానికి సలహాలు ఇవ్వడమే తన ఉద్దేశమని, ప్రభుత్వ సహకారం ఉంటే మరింత ఉత్సాహంతో ఎక్కువ సమయం కేటాయించి సేవ చేస్తానని చెప్పారు. అయితే హోదా లేకపోతే మాటలకు విలువ ఉండదని, పదవిలో ఉంటేనే ఆచరణకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ముఖ్యమంత్రి వివరించారు.ఈ నేపథ్యంలో మంతెన కీలక నిర్ణయం తీసుకున్నారు. తాను ప్రకృతి వైద్య సలహాదారుగా కొనసాగేందుకు సిద్ధమేనని, అయితే క్యాబినెట్ హోదాతో వచ్చే ఏ సదుపాయాలనూ స్వీకరించనని స్పష్టం చేశారు. నెల జీతం, ప్రభుత్వ కారు, ఇతర ఖర్చులు, ఇంట్లో సహాయకుల జీతాలు, విమాన లేదా రైలు ప్రయాణ సౌకర్యాలు, కార్యాలయ వసతులు---ఏదీ తీసుకోనని తేల్చి చెప్పారు. పూర్తిగా సేవాభావంతోనే పనిచేస్తానని వెల్లడించారు.డాక్టర్ మంతెన అభిప్రాయాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంగీకరించారు. దీంతో పదవికి అతీతంగా సేవే లక్ష్యంగా ప్రకృతి వైద్య రంగానికి డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు మార్గదర్శకత్వం అందనుంది.

# ప్రముఖులకు పద్మ పురస్కారాలు

(మొదటి పేజీ (తరువాయి)

ఇతర ప్రముఖులలో ఎస్ జీ సుశీలమ్మ, శ్యామ్ సుందర్, చిరంజి లాల్ యాదవ్, ఇంద్రజీత్ సింగ్, రఘువత్ సింగ్, ఆర్ కృష్ణన్, పద్మ గుర్మిత్, అంకె గౌడ, ఆర్మిడ ఫెర్నాండెజ్, బ్రిజ్ లాల్ భట్, భగవాన్ దాస్ రైకర్, టెక్కి గుబిన్, సురేష్ హనగవాడి, సిమాంచల్ పాత్రో, విశ్వ బంధు, శ్రీరంగ్ దేవబ లాడ్, కాలియప్ప గౌండర్, పోఖిల లేఖేపి, నూరుద్దీన్ అహ్మద్, నరేష్ చంద్ర దేవ్ వర్మ తదితరులు ఉన్నారు.

పద్మశ్రీ అవార్డులు దేశభక్తి, సేవాభావం, ప్రతిభకు గుర్తింపు మాత్రమే కాక, యువతను సేవా దారిగా ప్రేరేపించే మార్గం కూడా అవుతున్నాయి. కేంద్రం ప్రతీ సంవత్సరం ఈ విధమైన పురస్కారాల ద్వారా సమాజంలో సానుకూల ప్రేరణను అందిస్తోంది.

# యువతకు మోడీ పిలుపు

(మొదటి పేజీ (తరువాయి)

ఓటరుగా ఉండటం కేవలం హక్కు మాత్రమే కాదు, భారత భవిష్యత్తును రూపొందించడంలో ప్రతి పౌరుడికి ప్రధాన బాధ్యత." ఎలక్షన్ కమిషన్ సిబ్బందికి ప్రత్యేక అభినందనలతో పాటు, ప్రజాస్వామ్య ప్రక్రియల్లో పాల్గొనడం ద్వారా దేశాన్ని బలోపేతం చేయవచ్చని మోదీ తెలిపారు.

జాతీయ ఓటర్ల దినోత్సవం జనవరి 26కు ముందు రోజు జరగడం, భారత రాజ్యాంగ సృష్టికర్తలకు నివాళి అర్పించే ప్రత్యేక సందర్భంగా ప్రధాని భావిస్తున్నారు. ఈ రోజు యువత ఓటర్లుగా మారడం, ప్రజాస్వామ్య విలువలను గుర్తించడం, స్థానిక స్థాయిలో సామూహికంగా చైతన్యం సృష్టించడం ద్వారా దేశ ప్రజాస్వామ్యానికి కొత్త ఊజం వస్తుంది. ప్రధానమంత్రి పిలుపు యువతలో క్రియాశీలత, బాధ్యత మరియు చైతన్యాన్ని పెంపొందించడానికి దోహదపడుతుంది.

ఈ సందర్భంగా, ప్రతి యువ ఓటర్ తమ హక్కును వినియోగించి, దేశ భవిష్యత్తులో తాము ప్రాణం పూయగలగడం, స్థానిక స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామ్యం అవ్వడం అత్యంత ముఖ్యమని మోదీ చెప్పడం గమనార్హం.

# మహిళలే అజెండా

(మొదటి పేజీ (తరువాయి)

సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. 18 నుంచి 21 పని దినాలు సమావేశాలు కొనసాగించే అవకాశం ఉంది. ఈసారి బడ్జెట్ రాజకీయంగా మాత్రమే కాకుండా పాలనా పరంగానూ కీలకంగా మారనుంది.మహిళా సంక్షేమంతో పాటు విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాలకు ఈ బడ్జెట్ లో ప్రాధాన్యత ఇవ్వనున్నారు. అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, గ్రామీణాభివృద్ధి, ఇరిగేషన్ రంగాలకు భారీ కేటాయింపులు చేసే అవకాశముందని సమాచారం. ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్ తో పాటు ఇరిగేషన్‌కు ప్రత్యేక నిధులు కేటాయించే యోచనలో ప్రభుత్వం ఉంది.పాలనలో రెండేళ్లు పూర్తి చేసుకొని మూడో ఏడాదిలోకి అడుగుపెడుతున్న సమయంలో ప్రవేశపెట్టనున్న ఈ బడ్జెట్ కూటమి ప్రభుత్వానికి రాజకీయంగా కీలక మలుపుగా మారనుంది. మహిళలకు ప్రాధాన్యత ఇచ్చే నిర్ణయాలతో పాటు సూపర్ సిక్స్ హామీల అమలే ఈ బడ్జెట్‌కు ప్రధాన బలంగా నిలవనుందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# జల సంకల్పానికి మోడీ ఫిదా

(మొదటి పేజీ (తరువాయి)

ప్రజలు గట్టి పునాది వేశారని ప్రశంసించారు. కరవు ప్రాంతంలో సాగుతున్న ఈ సమిష్టి ప్రయత్నాలు భవిష్యత్తు తరాలకు నీటి భద్రత మన్ కీ బాత్ కార్యక్రమంలో అనంతపురం జిల్లా ప్రజల కృషిని ప్రస్తావించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ధన్యవాదాలు తెలిపారు. ఎక్స్ వేదికగా స్పందించిన సీఎం, ఈ ఏడాది తిరిగి ప్రారంభమైన తొలి మన్ కీ బాత్‌లోనే అనంతపురం ప్రజల స్ఫూర్తిదాయకమైన జలసంరక్షణ చర్యలను ప్రధాని గుర్తించడం ఎంతో ప్రోత్సాహకరమని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో చేపట్టిన ఈ జలవనరుల పునరుద్ధరణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని స్పష్టం చేశారు.'స్వర్ణ ఆంధ్ర విజన్' కింద ప్రభుత్వం నిర్దేశించుకున్న పది కీలక సూత్రాల్లో నీటి భద్రత అత్యంత ప్రధానమైనదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. సాంప్రదాయ నీటి నిర్వహణ విధానాలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడిస్తూ రాష్ట్రం ముందుకెళ్తోందని తెలిపారు. మన్ కీ బాత్?లో ప్రధాని మోదీ ఇచ్చిన సందేశం రాష్ట్రంలో అమలవుతున్న నీటి భద్రతా మిషన్‌కు మరింత రాజకీయ బలం, ప్రజా ఉత్సాహం అందిస్తోందని సీఎం తన ట్వీట్?లో పేర్కొన్నారు.

# ప్రజాస్వామ్య యుద్ధం

(మొదటి పేజీ (తరువాయి)

వ్యాఖ్యలు చేస్తున్న నేపథ్యంలో కరూర్ తొక్కిసలాట ఘటనపై సీబీఐ విచారణ ఎదుర్కొంటూ, తన కొత్త సినిమా విడుదలకు ఎటువంటి భయంకర పరిస్థితులకైనా దిగువన నిలిచిన పరిస్థితి ఉంది. ఇది ఆయన రాజకీయ ప్రతిభను మరింత బలపరుస్తూ, మీడియా దృష్టిని ఆకర్షించింది.అధికార డీఎంకే, ప్రధాన విపక్షం ఏఐడీఎంకేపై సూటిగా విమర్శలు విసురుతూ, "ఎవరైతే 'అన్న' పేరును రాజకీయాల్లో వాడుతున్నారు, వారు అసలు అన్నాదురైని మరిచిపోయారు. అధికారంలో ఉన్న వారికి పోలింగ్ బూత్?లు బోగస్ ఓట్ సెంటర్లుగా మారాయి" అని అన్నారు.విజయ్ ప్రకారం, దుష్ట శక్తి (డీఎంకే) మరియు అవినీతి కూటమి (అన్నాడీఎంకే)ను ఎదుర్కొనే ధైర్యం, సమర్థత టీవీకేకు మాత్రమే ఉంది.పార్టీ నేతల ప్రకారం, సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్త ప్రచార యాత్ర ప్రారంభం అవుతుంది. ఈ యాత్ర రాష్ట్రంలోని 234 అసెంబ్లీ నియోజకవర్గాలను కవర్ చేస్తుంది. తాజాగా కేంద్ర ఎన్నికల సంఘం టీవీకేకు 'విజల్' గుర్తును కేటాయించింది. విజయ్ ఈ ఎన్నికల్లో పార్టీ పొత్తులపై తుది నిర్ణయం త్వరలో తీసుకోనున్నారు. నాయకత్వం, పార్టీ కార్యకర్తలు, మద్దతుదారుల ఉత్సాహం చూస్తే, టీవీకే రాజకీయ వేదికపై కొత్త చిహ్నంగా నిలవనుంది అని విశ్లేషకులు చెబుతున్నారు.

# మహిళల భద్రతకే శక్తి యాప్

## జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు

పుట్టపర్తి (తెలుగోడు ), జనవరి 25 :

శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా మహిళలు, బాలికల భద్రతే లక్ష్యంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో 'శక్తి' యాప్‌పై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు శక్తి టీమ్ బృందాలు, పోలీసు సిబ్బంది కలిసి ఈ కార్యక్రమాలను చేపట్టారు.ఆదివారం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మహిళలకు శక్తి యాప్ వినియోగంపై స్పష్టమైన అవగాహన కల్పించారు. ఆపద సమయంలో మహిళలు, బాలికలకు తక్షణ రక్షణ కల్పించడంలో ఈ యాప్ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ప్రతి మహిళ తమ మొబైల్ ఫోన్‌లో శక్తి యాప్‌ను తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.మహిళలు, చిన్నారులపై నేరాలు ఎదురైనప్పుడు తక్షణ సహాయం కోసం డయల్ 100, 112 సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. చిన్నారుల రక్షణకు చైల్డ్ లైన్ 1098, గృహ హింసకు 181, మహిళల వేధింపులకు 1091, సైబర్ నేరాలకు 1930 టోల్ ఫ్రీ నంబర్, సైబర్ మిత్ర సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించారు.ప్లే స్టోర్ ద్వారా శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసి వ్యక్తిగత వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. యాప్?లోని ఎస్‌ఓఎస్ బటన్ నొక్కిన వెంటనే లేదా డయల్ 112కు సమాచారం ఇచ్చిన వెంటనే పది నిమిషాల్లో పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని సహాయ చర్యలు చేపడతారని స్పష్టం చేశారు.ఈ అవగాహన కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, శక్తి టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.



సూర్యభగవానుడిని పూజిస్తున్న అర్చకులు, విగ్రహదాత కుమారుడు రౌతుల నాగరాజు

## ఘనంగా రథసప్తమి వేడుకలు

**పామిడి (తెలుగోడు), జనవరి 225 :**
పట్టణంలోని శ్రీ నగరేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం సూర్యభగవానుడి జయంతిని పురస్కరించుకుని స్వాముల వారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు అర్చనలతో పూజలు చేపట్టి రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పామిడికి చెందిన రిటైర్డ్ సిఐ రౌతుల వరదప్ప శ్రీ నగరేశ్వరస్వామి దేవాలయానికి అందించిన సూర్యభగవానుడిని ప్రత్యేకంగా అలంకరించిన అర్చకులు రాజస్వామి పూజలు చేపట్టారు. శ్రీ నగరేశ్వరస్వామి దేవాలయంలో సూర్యభగవానుడిని దర్శించుకున్న విగ్రహదాత రిటైర్డ్ సిఐ రౌతుల వరదప్ప కుమారుడు రౌతుల నాగరాజు మాట్లాడుతూ మాఘశుద్ధ సప్తమిని రథసప్తమి అంటరాని, సూర్యుడు ఏకచక్ర రథము ఆరు ఆకులు ఏడు అశ్వాలతో కూడిన వాహనంపై ప్రయాణిస్తాడని, చక్రం అంటే ఒక సంవత్సరం ఆరు ఆకులు అంటే ఆరు రుతువులు ఏడు అశ్వాలు అంటే ఏడు కిరణాలు అని వివరించారు. సూర్యభగవానుడు ఉదయం సమయంలో బ్రహ్మ స్వరూపంగా ప్రకృతిలో జీవాన్ని నింపి మహేశ్వరుడిలా మధ్యాహన్నం తన కిరణాల ద్వార దైవిక వికారాలను రూపుమాపి సాయంకాలం విష్ణు రూపంలో భాసిల్లే కిరణాలను మనోరంజకముగా ప్రసరింపజేస్తూ ఆనందింపజేస్తారని అర్చకులు వెల్లడించారు. శ్రీ నగరేశ్వరస్వామి దేవాలయంలో సూర్యభగవానుడిని దర్శించుకునేందుకు పెద్దఎత్తున చేరుకున్న భక్తులు పూజలు చేపట్టి తీర్థప్రసాదాలను స్వీకరిస్తూ స్వామి వారి కృపను పాత్రులయ్యారు.



రథసప్తమి సందర్భంగా కనేకల్‌లో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తాదులు

## ఘనంగా రథసప్తమి వేడుకలు

**కనేకల్ (తెలుగోడు), జనవరి 25 :**
స్థానిక శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో రథసప్తమి వేడుకలు ఆదివారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుండి స్వామివారికి సుప్రభాత సేవ, ప్రత్యేక అలంకరణ, ధూప దీప నైవేద్యాలతో విశేష పూజలు, అలంకరణలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేణు, విజయేంద్ర స్వాముల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ 2026 సంవత్సరం సూర్య భగవానుని సంవత్సరమని రథసప్తమి వేడుకలు సూర్య భగవానునికి సంబంధించిన వేడుకలన్నారు. ఈ వేడుకలు సూర్యనారాయణమూర్తి రోజైన ఆదివారం రావడం మరింత శుభప్రదం అన్నారు. సూర్యభగవానుని కృపాకటాక్షాల వలన అందరికీ ఆయురారోగ్యాలు పెరుగుతాయని సూర్య భగవానుడిని భక్తాలు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజించుకోవాలన్నారు. మనిషి జీవితంలో అన్నింటికన్నా ముఖ్యమైన ఆయురారోగ్యాలు వాటిని అందించే ప్రదాత సూర్య భగవానుడైన అన్నారు. ఆయన కృప కటాక్షాల కొరకు ప్రతి ఒక్క భక్తుడు భక్తిశ్రద్ధలతో ప్రతిరోజు ఆయన్ని ఆరాధించడం వల్ల ఆయురారోగ్యాలు మెరుగుపడతాయన్నారు. అనంతరం శ్రీ భూదేవి, శ్రీదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారిని పట్టణంలోని ప్రధాన పుర వీధుల్లో ఊరేగించారు. రథయాత్రను దర్శించేందుకు ప్రజలు అధిక సంఖ్యలో చేరుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ వేడుకలను ఆధ్యాత్మిక వాతావరణంలో జరిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

## వజ్రోత్సవ భారతి అవధాన సప్తాకం ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

**అనంతపురం కల్చరల్ (తెలుగోడు), జనవరి 25 :**
నగరంలోని శారద నగర్ శ్రీ శృంగేరి శంకరమఠంలో వజ్రోత్సవ భారతి అవధాన సప్తాకం శంకరమఠం వార్షికోత్సవం ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ హెడ్ సత్యప్రసాద్ మాట్లాడుతూ శ్రీ భారతితీర్థుల మహాస్వామి వారి చేతులు మీదుగా శ్రీ శృంగేరి శంకర మఠంలోని శ్రీ శారదా పరమేశ్వరి, జగద్గురు ఆది శంకరాచార్యులు, శ్రీ చంద్రమౌళిశ్వర స్వామి మూలవిగ్రహ ప్రతిష్ట జరిగిందన్నారు. 3 దేవాలయాల కుంభాభిషేకం, శ్రీ విధుశేఖర భారతి వారి చేతుల మీదుగా జరిగిందన్నారు. శ్రీ భారతి తీర్థుల వజ్రోత్సవ భారతి మహోత్సవాలు పురస్కరించుకొని శృంగేరి శంకర మఠంలో ఈనెల 29, 30 తేదీల్లో రెండు రోజులపాటు ఆలయంలో విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే రెండు రోజులపాటు వివిధ రాష్ట్రాలకు చెందిన శతావధాలను, అష్టావధానులతో అవధాన సప్తాకంలో భాగంగా 29వ తేదీ 4 అవధానాలు 30వ తేదీ మూడు అవధానాలు ఉదయం 9 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు రోజులపాటు జరిగే కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి స్వామివారి కృపకు పాత్రులు కావాలని, అవధాన సప్తహకంతో శ్రవణానందం పొందాలన్నారు. పూజల్లో పాల్గొనదలచిన భక్తులు ఆలయంలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ మోహన్ రావు, ఆలయ అర్చకులు రామకృష్ణ మార్తాండ నరసింహ, లతోపాటు సిబ్బంది రామాంజి తదితరులు పాల్గొన్నారు.

## అయోధ్యకు కాలినడకన కర్ణాటక భక్తుడు

**కనేకల్లు (తెలుగోడు )జనవరి 25:**
అయోధ్యలో కొలువుతీరిన శ్రీ రాముని దర్శనం కోసం కర్ణాటకకు చెందిన సంజీవరెడ్డి జైశ్రీరామ్ అంటూ కాలినడకన కర్ణాటకలో బయలుదేరాడు. ఈ సందర్భంగా ఆదివారం కనేకల్ పట్టణం కనేకల్ ప్రజల ఆరాధ్య దైవం అయిన శ్రీ చిక్కనేశ్వర స్వామి ని దర్శించుకున్నాడు. అతను చిత్ర దుర్గం నుండి అయోధ్య రామ మందిరానికి కాలినడకతో పాదయాత్ర చేస్తున్నారు.




కనేకల్ శ్రీ చిక్కనేశ్వర స్వామి దర్శనం చేసుకున్న కర్ణాటక భక్తుడు సంజీవరెడ్డి

# అశ్వర్థం బ్రహ్మోత్సవాలకు పోటెత్తిన భక్తులు

**శ్రీ అశ్వర్థ నారాయణస్వామి, శ్రీ చక్ర భీమలింగేశ్వరస్వామి నామస్మరణతో మారుమోగిన్న అశ్వర్థం.. మొదటి ఆదివారం ముస్తాబైన శ్రీ అశ్వర్థ నారాయణస్వామి కట్ట ..**

**తాడిపత్రి (తెలుగోడు), జనవరి 25 :**
తాడిపత్రి నియోజకవర్గ పరిధిలోని పెద్దపప్పూరు మండలంలోని శ్రీ అశ్వర్థ నారాయణ స్వామి క్షేత్రంలో మాఘమాసం బ్రహ్మోత్సవాలలో భాగంగా మొదటి ఆదివారం వేడుకలు ఘనంగా ప్రారంభమైనాయి. అర్ధరాత్రి నుంచి అశ్వర్థం బ్రహ్మోత్సవాలకు భక్తులు పోటెత్తినారు. తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డిలు బ్రహ్మోత్సవాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. కర్ణాటక రాష్ట్రం నుంచి వివిధ రకాల



ప్రత్యేక అలంకరణలో శ్రీ అశ్వర్థ నారాయణ స్వామి కట్ట



ప్రత్యేక అలంకరణలో శ్రీ చక్ర భీమలింగేశ్వర స్వామి, శ్రీ అశ్వర్థ నారాయణ స్వామి

పుష్పాలను తెప్పించి శ్రీ అశ్వర్థ నారాయణస్వామి కట్టను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్ దీప కాంతుల నడుమ దేవస్థానం విరాజుల్లుతోంది. అశ్వర్థంలో మాఘమాసం మొదటి ఆదివారం బ్రహ్మోత్సవాలు అర్ధరాత్రి 12 గంటలకు స్వామివార్లకు అభిషేకాలు, పూజా కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలు నడుమ విశేష పూజలు ఆలయ అర్చకులు బాలసుబ్రమణ్యంశర్మ, సుధీర్ శర్మ నిర్వహించారు. దర్శనం కోసం అర్ధరాత్రి 12 గంటల నుంచి భక్తులు బారులు తీరారు. పెన్నానదిలో మాఘాస్నాన మాచరించి భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. అధికారులు భక్తుల కోసం పెద్ద ఎత్తున క్యూలైన్లు, చలువ పందిర్లు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు. ఆలయ చైర్మన్ శివ శంకర్ రెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు ఏర్పాట్లు, పరిస్థితులను పర్యవేక్షించారు.

# వంట ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలి

**రాయదుర్గం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గౌని ప్రతాప్ రెడ్డి..**

**కనేకల్ (తెలుగోడు )జనవరి 25:**
కనేకల్ మండల పరిధిలోని 43 ఉడేగోళం లోని ప్రభుత్వ పాఠశాలలో ఇటీవల మధ్యాహ్న భోజనం తీసుకున్న విద్యార్థులు ఫుడ్ పాయిజన్ కారణంగా అస్వస్థతకు గురవడం అత్యంత శోచనీయమని రాయదుర్గం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గౌనీ ప్రతాప్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు బాధ్యులైన పాఠశాల మధ్యాహ్న భోజన పథకం వంట ఏజెన్సీ మరియు వంట కాంట్రాక్టర్?పై తక్షణమే సస్పెన్షన్ విధించి, కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయమై ఎంపీడీవో విజయసింహారెడ్డి గారితో ఫోన్ ద్వారా మాట్లాడి తన అభ్యంతరాలను తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలకు సంబంధించిన 26 మంది పైగా విద్యార్థులు ఆహార విషబాధకు గురై ఆసుపత్రికి తరలించబడటం తీవ్రంగా కలచివేస్తుందని తెలిపారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ఉండాలంటే సంబంధిత అధికారులైన ఎంపీడీవో, తహసిల్దార్, మండల విద్యాధికారులు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. కుళ్లిపోయిన కోడిగుడ్లు, నాసిరకం సరుకులతో పిల్లలకు వంట చేసి లాభాపేక్షతో వ్యవహరించడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో ఇతర



మాట్లాడుతున్న రాయదుర్గం కాంగ్రెస్ అధ్యక్షుడు గౌని ప్రతాప్ రెడ్డి

ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఇలాంటి నాణ్యతలేని ఆహారం సరఫరా కొనసాగుతుందని హెచ్చరించారు.
ఇకపై తాను ప్రభుత్వ పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని, అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు కూడా వారానికి కనీసం ఒక్కసారి అయినా పాఠశాలను సందర్శించి వంట సామగ్రి నాణ్యతను పరిశీలించాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు ఎదురైతే జీపీఆర్ హెల్ప్?లైన్ నెంబర్ 7386566233 కు కాల్ చేసి సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా రథసప్తమి పూజలు

**అనంతపురం కల్చరల్ (తెలుగోడు), జనవరి 25 :**
స్థానిక హెచ్‌ఎల్‌సి కాలనీలోని శ్రీ కొల్హాపూర్ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో రథసప్తమి పూజలు వ్రతాలు ఘనంగా నిర్వహించారు ఆలయ అర్చకులు పుబ్బరాజు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో శ్రీ ఉషా ఛాయాదేవి సమేత శ్రీ సూర్యనారాయణ స్వామివారి వ్రతం, రథ సప్తమి విశిష్టతను భక్తులకు వివరించారు. పూజ అనంతరం మహా మంగళారతి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి దేవనూర్ సుందరం విజయకుమార్ నాగభూషణం ఆనంద్



భగవద్గీత పుస్తకాలు అందజేస్తున్న శ్రీపాదవేణు



పూజలో పాల్గొన్న భక్తులు

కుమార్ ప్రవీణ్ నాగరతన్నా సువర్ణ మాధవి మహిళ మండలి సభ్యులు భక్తులు పాల్గొన్నారు.
తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో రథసప్తమిని పురస్కరించుకొని స్థానిక గ్లోబల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థినీ విద్యార్థులతో సూర్య నమస్కారాలు చేయించారు. విద్యార్థిని విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచారమండలి సభ్యులుశ్రీపాద వేణు మొదలగువారు పాల్గొన్నారు.

# పేదరిక నిర్మూలనే లయన్స్ క్లబ్ లక్ష్యం

**ఉచిత కంటి మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన .. డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు ..**

**పామిడి (తెలుగోడు), జనవరి 225 :**
పేదరిక నిర్మూలనే లక్ష్యంగా లయన్స్ క్లబ్ అనేక సేవా కార్యక్రమాలను చేపడుతోందని ఆసంస్థ వ్యవస్థాపక అద్యక్షులు, ప్రభుత్వ ఆయూష్ సీనియర్ వైద్యులు డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీ భావసారా క్షత్రీయ కళ్యాణ మండపం నందు ఆదివారం లయన్స్ క్లబ్ ఆద్వర్యంలో బెంగుళూరు శంకరకంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ వారు ఉచిత కంటి మెగా వైద్యశిభిరాన్ని నిర్వహించారు. ఈసందర్బంగా డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు మాట్లాడుతూ కంటిచూపు బాగుంటేనే ఎవరికి వారు వారి పనులను చేసుకోగలరని చూపు లేకుంయిటే జీవితం అంధకారమే అని అందువల్ల ప్రతిఒక్కరూ కళ్ళను నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సేవకు కేరాఫ్ అడ్రసుగా మారిన లయన్స్ క్లబ్ ద్వార ప్రజారోగ్యాల పరిరక్షణ కోసం ఉచిత వైద్యశిభిరాలను నిర్వహిస్తూ నిరుపేదలకు వైద్యసేవలను అందిస్తున్నామని తెలిపారు. బెంగుళూరు శంకరకంటి ఆసుపత్రి కంటి



కంటిచూపు మందగించిన వృద్ధురాలిని పరీక్షిస్తున్న డాక్టర్ అభిజ్ఞ

వైద్యనిపుణురాలు డాక్టర్ అభిజ్ఞ మాట్లాడుతూ మానవ జీవిత గమ్యానికి కంటిచూపే మార్గాన్ని చూపిస్తుందన్నారు.
అనంతరం కంటి వైద్యనిపుణులు డాక్టర్ అభిజ్ఞ కంటిచూపు మందగించిన 120 మందిని పరీక్షించి అందులో 45 మందిని ఆపరేషన్లకు రెఫర్ చేశారు. కంటి పరీక్షలు చేయించుకోవటానికి వచ్చిన వారితో శ్రీ భావసార క్షత్రీయ కళ్యాణ మండపం కిటకిటలాడగా ఉచిత కంటి మెగా వైద్యశిభిరానికి విశేష స్పందన లభించింది. ఉచిత కంటి మెగా వైద్యశిభిరానికి హాజరైన వారందరకీ అన్నదానం చేశారు. ఇదిలావుండగా పర్యావరణ పరిరక్షణ మనందరి బాద్యత అంటూ ఉచిత కంటి మెగా వైద్యశిభిరంలో డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు మొక్కలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా చైర్ పర్సన్ డాక్టర్ శాంతిప్రియ, పామిడి ప్రధాన కార్యదర్శి పత్రా శ్రీనివాసులు, షేక్షావలి, గంగశేఖర్, ప్రసాద్, అల్లెపురం నాగరాజు, కొండూరు అమర్నాథ్ రెడ్డి, నరేష్, రాకేష్, జయరాం, మానవహక్కుల సంఘము సౌత్ ఇండియా కార్యదర్శి ఆవుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు



టిడిపి జిల్లా అధ్యక్షుడు నాగరాజును సత్కరిస్తున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి

## టిడిపి జిల్లా అధ్యక్షుడు నాగరాజుకి సత్కారం

**ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి ..**

**తాడిపత్రి (తెలుగోడు), జనవరి 25 :**
అనంతపురం నగరంలోని కమ్మ భవన్‌లో ఆదివారం తెలుగుదేశం పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేసిన పూల నాగరాజుకి తాడిపత్రి శాసనసభ్యులు జెసి అస్మిత్ రెడ్డి అభినందనలు తెలిపారు. అనంతరం పూల నాగరాజుకి శాసనసభ్యులు జెసి అష్మిత్ రెడ్డి శాలువాతో సత్కరించి, మొమెంటోను అందజేశారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న రూరల్ సీఐ శివ గంగాధర రెడ్డి

## అశ్వర్థం తిరునాళ్లలో చలివేంద్రం ఏర్పాటు

**తాడిపత్రి (తెలుగోడు), జనవరి 25 :**
పెద్ద పప్పూరు మండలం అశ్వర్థం తిరునాళ్లలో మొదటి ఆదివారం పురస్కరించుకొని ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తాడిపత్రి రూరల్ సీఐ శివ గంగాధర రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ శివ గంగాధర రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ నిరంతరం కొనసాగిస్తున్న సేవా కార్యక్రమాలను హృదయపూర్వకంగా అభినందిస్తున్నానని తెలిపారు. ప్రజాసేవే పరమావధిగా, సమాజ హితమే లక్ష్యంగా మన ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ చేస్తున్న సేవలకు ప్రోత్సాహం అందించడం మరింత ఉత్తేజాన్ని కలిగిస్తుందన్నారు. అనంతరం వర్కింగ్ ప్రెసిడెంట్ నారబోయిన శంకర్ మాట్లాడుతూ మన సేవా సంస్థ కోసం విలువైన సమయాన్ని కేటాయించి, ప్రోత్సహించిన తాడిపత్రి రూరల్ సీఐ శివ గంగాధర రెడ్డికి ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ గౌరవ సలహాదారులు శ్రీరంగయ్య, అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి రామేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు కుమారస్వామి, సభ్యులు సుధాకర్, పద్మావతి పాల్గొన్నారు.

## నాగేపల్లి లో ఘనంగా ఓటరు దినోత్సవం

**కనేకల్ (తెలుగోడు) జనవరి 25:**
కణేకల్ మండల పరిధిలోని నాగేపల్లి గ్రామంలో ఓటర్ దినోత్సవంఆదివారం ఘనంగా నిర్వహించారు. ఓటర్ దినోత్సవం సందర్భంగా వీఆర్వో తెలుగుదేశం నాయకులు వెంకటేశ్వర్లు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా నాయకులు అధికారులు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతి యువకులు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓటు చాలా విలువైనదని ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని వీఆర్వో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి ఓటు హక్కు పై అవగాహన కల్పించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న నాగినిపల్లి గ్రామస్తులు, అధికారులు

## అగాపే ఆశ్రమంలో అన్నదానం

**యాడికి. (తెలుగోడు) జనవరి 25 :**
యాడికి మండల కేంద్రంలోని కమలపాడు రోడ్డు రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే ఆశ్రమంలో ఆదివారం ఓబులాపురం గ్రామానికి చెందిన వెన్నపూస లక్ష్మిరెడ్డి, భార్య లక్ష్మి నారాయణమ్మ, వీరి కుటుంబము ఆశ్రమంలోని నిరాశ్రయులందరికీ వెన్నపూస లక్ష్మిరెడ్డి గారి పొలంలో బోరు వేయడం ద్వారా నీళ్లు సమృద్ధిగా పడ్డాయి. నీళ్లు పడ్డం ద్వారా కృతజ్ఞతగా అన్నదానం ఏర్పాటు చేశారు. కుటుంబముతో ఆశ్రమలోనికి వచ్చి అందరికీ భోజనాలు వడ్డించారు. ఇందు నిమిత్తమై ఆశ్రమం ఫౌండర్ బత్తల ప్రసాద్, ఆశ్రమంలోని వారంతా వారికి వారి కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు.



అగాపే ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



శ్రీ సిద్దేశ్వర స్వామికి పూలతో అలంకరణ

# శ్రీ సిద్దేశ్వర స్వామికి విశేష పూజలు

**అమరాపురం (తెలుగోడు), జనవరి 25 :**
మండల పరిధిలోని హేమావతిలో వెలసిన శ్రీ సిద్దేశ్వర స్వామి ఆలయం. శ్రీ సిద్దేశ్వర స్వామికి ఆదివారం తెల్లవారుజాము నుండి తైలాభిషేకం, రుద్రాభిషేకం, అభిషేకం, కుంకుమార్చన తదితర విశేష పూజలు, ఘనంగా ఆలయ అర్చకులు నిర్వహించారు శ్రీ సిద్దేశ్వర స్వామికి పూలతో అలంకరణ చేశారు.. ఈ పూజా కార్యక్రమాలు ఆలయ అధ్యక్షులు కరే గౌడ ఆధ్వర్యంలో నిర్వహించారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నుండి భక్తులు అధిక సంఖ్యలో రథసప్తమి వేడుకల సందర్భంగా శ్రీ సిద్దేశ్వర స్వామికి మొక్కుబడులు తీర్చుకొని పూజలు నిర్వహించారు. వచ్చిన భక్తాదులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు మహా మంగళహారతి, తీర్థప్రసాదాలు అందజేశారు.



ముగ్గులు పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్నా మండల ప్రధాన కార్యదర్శి ఉగ్రేగౌడ్

# ఘనంగా ఓటర్ల దినోత్సవం
### ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు

**రొళ్ల (తెలుగోడు), జనవరి 25 :**
మండల పరిధిలోని ఎం. రాయపురం ఉన్నత పాఠశాలలో ఆదివారం ఓటర్ల దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఈసందర్భంగా బాలికలకు పాఠశాల ఆవరణంలోనే ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విజేతలకు మండల ప్రధాన కార్యదర్శి ఉగ్రేగౌడ్, బహుమతులు ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో వీఆర్వో నాగరాజు ఎం. రాయపురం చెరువు సంఘం అధ్యక్షులు ఈరన్న, బి ఎల్ ఓ లు మాలింగా, అనిల్ కుమార్, బిలియన్న పాల్గొన్నారు.



విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

# ఘనంగా కెంపెగౌడ జయంతి ఉత్సవాలు

**గుడిబండ (తెలుగోడు), జనవరి 25 :**
మండల పరిధిలోని శంకరగల్లు గ్రామంలో ఆదివారం నాడాప్రభు కెంపెగౌడ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న కుంజిటిగా ఒక్కలుగా కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, అమరాపురం సింగల్ విండో అధ్యక్షుడు గణేష్, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కె ఎన్ పల్లి సురేష్, రాష్ట్ర కుంచిటిగా ఒక్కలిగా సాధికార కన్వీనర్ పాండురంగప్ప లు మాట్లాడుతూ ఆనాడు నాడా ప్రభు కెంపెగౌడ సమాజానికి చేసిన సేవలు మరువలేనివని అలాంటి గొప్ప నాయకుడు ఆశయాలను కొనసాగించడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. అలాగే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గుడిబండ ఎం జె పి గురుకుల కళాశాల చైర్మన్ జగదీష్, కుంచిటిగా నాయకులు హనుమంతరాయప్ప, మంజునాథ, రామ్మూర్తి, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపికైన ఆర్ఐ గిరియప్ప

**రొళ్ల (తెలుగోడు), జనవరి 25 :**
మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గిరియప్ప ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపికయారు. ఆర్ ఐ గిరియప్ప విధుల్లో చూపిన అంకితభావం, నిజాయితీ సమర్థవంతమైన సేవలకు ప్రతిష్టాత్మక అవార్డును సోమవారం పుట్టపర్తిలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా గణతంత్ర దినోత్సవాన్ని



పురస్కరించుకొని అందుకోనున్నారు. ప్రజాసేవలో ఆయన చూపిన కృషి, ప్రభుత్వ కార్యక్రమాల అమలులో ఆయన పాత్ర ప్రశంసనీయమైందని గుర్తించి ఈ అవార్డు ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా మండలంలోని అధికారులు, సిబ్బంది ప్రజలు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. గిరియప్ప భవిష్యత్తులో మరింత నిబద్ధతతో ప్రజలకు సేవలందించి, మరిన్ని విజయాలు సాధించాలని తహసీల్దార్ షేక్షావలి ఆకాంక్షించారు.

# ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం ర్యాలీ

### బాలబాలికలకు అవగాహన.. తహసిల్దార్ సుబ్బారావు.. ఆర్ఐ చంద్రశేఖరరావు..

**అగళి (తెలుగోడు), జనవరి 25 :**
మండల కేంద్రంలోని కేజీ గుప్తా కళాశాల ఆదర్శ కళాశాలలో ఆదివారం ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ద్యార్థులతో తాసిల్దార్ సుబ్బారావు ఆర్ఐ చంద్రశేఖర రావు ల ఆధ్వర్యంలో పట్టణంలోని బస్టాండ్ ఆవరణ, వాడలవాడలా ఓటంటే నాటు కాదు.. నీ దేశపు సోదరీ సోదరా మేలుకోండి. మీ ఓటు విలువ తెలుసుకోండి అనే నినాదాలతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు విద్యార్థులకు ఓటర్ నమోదుపై అలాగే వినియోగంపై అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి బాల బాలికలు ఓటు హక్కును నమోదు చేయించుకొని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. విద్యార్థులు



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు




ర్యాలీలో పాల్గొన్న జడ్పిటిసి ఉమేష్, నాయకులు

తమ తమ ఇళ్లలోనే కాకుండా పరిసరాల ఇళ్లలో కూడా ఓటు హక్కులేని వారిని గుర్తించి ఓటు హక్కు పొందే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఓటరు నమోదు ప్రక్రియ నిరంతరాయంగా ఉంటుందని 18 ఏళ్లు నిండిన వారు బిఎల్వోల వద్ద గాని ఆన్లైన్ నెట్ సెంటర్లలో కానీ ఓటర్ నమోదు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఓటును దుర్వినియోగం చేయకుండా ప్రలోభాలకు గురికాకుండా అభివృద్ధిని కాంక్షించే నాయకుడికి ఓటు వేస్తామని అన్నారు. ఓటు హక్కుని వినియోగించుకుందాం, ఆదర్శవంతమైన ప్రజాస్వామ్య వ్యవస్థ కోసం మన వంతు పాత్ర పోషిద్దాం, అని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి ఉమేష్, క్లస్టర్ కో కన్వీనర్ కమ్మరి తెలుగు యువత అధ్యక్షుడు గోవిందరాజు, నాయకులు బొమ్మసానిపల్లి లింగరాజు, కే జి ఎ గుప్తా కళాశాల ప్రిన్సిపల్ రఘురాం, బీసీ బాయ్స్ హాస్టల్ వార్డెన్ సికిందర్ సీనియర్ అసిస్టెంట్ గురన్న, విఆర్వోలు దొడ్డేగౌడ్, నరసింహమూర్తిసచివాలయ సిబ్బంది, వీఆర్ఏలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రథసప్తమి వేడుకలు
### శ్రీ లక్ష్మీనరసింహస్వామి, శ్రీ సూర్యనారాయణ స్వామికి అభిషేకాలు..

**అమరాపురం (తెలుగోడు), జనవరి 25 :**
మండల సరిహద్దు ప్రాంతంలో గల పావుగడ నియోజకవర్గం నిడుగల్లు కొండపై ఉన్న శ్రీక్షేత్రం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో రథసప్తమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. రథసప్తమి సందర్భంగా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామికి, శ్రీ సూర్యనారాయణ స్వామికి అభిషేకం, అర్చనలు, ప్రాకారోత్సవం, కుంకుమార్చన తదితర విశేష పూజలు ప్రధాన అర్చకులు హరీష్ భట్టాచార్యులు నిర్వహించారు. శ్రీ లక్ష్మి నరసింహ స్వామి, శ్రీ సూర్యనారాయణ స్వామికి పూలతో అలంకరణ చేసి మహా మంగళ హారతి,



శ్రీ సూర్యనారాయణ స్వామికి అభిషేకం చేస్తున్న దృశ్యం
శ్రీ లక్ష్మీ నరసింహ స్వామికి పూలతో అలంకరణ

తీర్థప్రసాదాలు అందజేశారు. బెంగళూరు ఇస్కాన్ టెంపుల్. శ్రీమాన్ శ్రీ సూర్యనాథ్ గిరి ధర దాన ప్రభు వీరిచే . అమరాపురం చుట్టుపక్కల గ్రామాల నుండి, పావగడ, వదనకల్, లింగన్న పల్లి గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయ ప్రాంగణంలో భజన కార్యక్రమం



శ్రీ లక్ష్మీ నరసింహ స్వామికి పూజలు నిర్వహిస్తున్న బెంగళూరు ఇస్కాన్ టెంపుల్ శ్రీమాన్ సూర్యనాథ గిరిధర దాన ప్రభు
నిడగల్లు పుణ్యక్షేత్రంలో బెంగళూరు ఇస్కాన్ టెంపుల్ వారిచే భజన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

# పలు శుభకార్యాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల

**అగళి (తెలుగోడు), జనవరి 25 :**
ఆదివారం పలు శుభకార్యాల్లో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. అగళి ఆర్ కె కల్యాణమండపంలో జరిగిన వివాహవేడుకలు, అగళి మండల సరిహదు కర్ణాటక రాష్ట్రం కార్పెహళ్లి గ్రామంలో గృహప్రవేశం కార్యక్రమం, అగళి మండలం ఇనగలూరు గ్రామానికి చెందిన మైలారప్ప కుమార్తె చైత్ర వివాహం, కర్ణాటక రాష్ట్రం సిరా తాలూకా మానంగి ఎన్ హెచ్- 4లో ఉన్న శ్రీరామాంజనేయ స్వామి కళ్యాణ మంటపంలో జరిగిన వివాహ వేడుకలలో తిప్పేస్వామి పాల్గొని నవ వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసమూర్తి, జడ్పిటిసి సభ్యులు ఉమేష్, మండల కన్వీనర్ తిప్పేస్వామి, క్లస్టర్ కోకన్వీనర్ కమ్మరి శివన్న, సింగిల్ విండో అధ్యక్షులు కుమారస్వామి, నాయకులు కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



గృహప్రవేశ వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి



వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

# గంధం ఉత్సవాల్లో మిన్నంటిన సేవాస్ఫూర్తి
### రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన..

**బత్తలపల్లి (తెలుగోడు), జనవరి 25 :**
బత్తలపల్లిలో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న ఇమామ్ ఖాశీం గంధం ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో పాటు సేవా కార్యక్రమాలతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. హజరత్ ఏ హిమామ్ బాశీం ట్రస్ట్ చైర్మన్ మక్తుం ఖాశీంవలి, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో, స్థానిక చావిడి వద్ద ఆర్డీటీ ఆసుపత్రి బ్లడ్ బ్యాంకు సహకారంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 80 మందికి పైగా యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి నిర్వాహకులు ప్రశంసా పత్రాలు అందజేశారు. సేకరించిన రక్తాన్ని తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల చికిత్స కోసం వినియోగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



రక్తదాతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న మాజీ ఎంపీపీ సత్యనారాయణ



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపి సత్యనారాయణ, నిర్వాహకులు

ఉత్సవాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. రాత్రి 8 గంటలకు కాశీంస్వామి పూలహారాలతో డీజే సౌండ్?తో ఊరేగింపు నిర్వహించగా యువత కేరింతలతో సందడి చేశారు. ముందు రోజు శనివారం మహిళల కోసం నిర్వహించిన ముగ్గుల పోటీలు నిర్వహించి, పోటీల్లో గెలిచిన మహిళలకు బహుమతులు ప్రధానం చేశారు.
ప్రథమ బహుమతిని కుమ్మర త్రిష (పోటమర్రి), ద్వితీయ బహుమతిని ప్రశాంతి (బత్తలపల్లి), తృతీయ బహుమతిని కృష్ణవేణి (బత్తలపల్లి)లు సాధించారు. రాత్రి నిర్వహించిన సప్తమాంకములు నాటక ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఆధ్యాత్మిక, సామాజిక సందేశాలతో నాటకం ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమాల్లో గ్రామ పెద్దలు జక్కంపూడి సత్యనారాయణ, జక్కంపూడి పురుషోత్తం చౌదరి, జక్కంపూడి వెంకటేశ్వర చౌదరి, నలజాల తిరుపాలు, మక్తుం కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రాథమిక పాఠశాల ఆవరణను చేస్తున్న విద్యార్థినిలు
ఎన్.ఎస్.ఎస్. స్పెషల్ ప్రోగ్రాంలో పాల్గొన్న విద్యార్థినిలు

# పూలమతిలో ఎన్.ఎస్. ఎస్. స్పెషల్ ప్రోగ్రాం

**అమరాపురం (తెలుగోడు), జనవరి 25 :**
హిందూపురం బాలాజీ జూనియర్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో పూలమతి గ్రామంలో ఎన్.ఎస్.ఎస్ . స్పెషల్ ప్రోగ్రాం ఈనెల 24 నుండి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. వీరభద్రప్ప పేర్కొన్నారు.. స్పెషల్ ప్రోగ్రాంలో భాగంగా రెండవ రోజు పూలమతి గ్రామం ప్రాథమిక పాఠశాల లో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ ,ఎన్.ఎస్. ఎస్. పి.ఓ. ఆనంద్ కళాశాల అధ్యాపకులు మేఘ మన్సూర్ నహిస్తా విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు




ఓటర్ల దినోత్సవంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

# కేజీబీవీలో ఘనంగా ఓటర్ల దినోత్సవం
### ఓటు హక్కుప్రాధాన్యత పై విద్యార్థులకు అవహగాహన.. తహసీల్దార్ షేక్షావలి..

**రొళ్ల (తెలుగోడు), జనవరి 25 :**
మండల పరిధిలోని అవినకుంట గ్రామంలో గల కస్తూరి బా గాంధీ పాఠశాలలో 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక తహసీల్దార్ షేక్షావలి ఆదివారం ఓటు హక్కు ప్రాధాన్యత పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యం లో ఓటు అనేది కీలకమని వజ్రాయుధం అని ఆయన విద్యార్థులకు తెలియజేశారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతి, యువకుడు ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు. ఓటు ద్వారానే ప్రజాప్రతినిధులను ఎన్నుకుని ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకుని పాలన కొనసాగించుకుంటున్నామని తెలిపారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అనుచరించి హక్కులను వినియోగిస్తూ బాధ్యతలను విధులను నిర్వర్తిస్తూ ఒక పౌరుడిగా మెలుగుతున్నామని ఆయన అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఆవశ్యకత గురించి వివరించారు, అంతకు ముందు విద్యార్థులతొ కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మున్వారజాన్ గ్రామ రెవెన్యూ అధికారి లక్ష్మినరసింహ, ఎలెక్షన్ కంప్యూటర్ ఆపరేటర్ యల్.నరసేగౌడు, పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు..

# వైసీపీ మండల విస్తృత స్థాయి సమావేశం
### సమన్వయ కర్త మక్బూల్.....

**తనకల్లు (తెలుగోడు), జనవరి 25 :**
తనకల్లు మండల కేంద్రంలో వైస్సార్సీపీ కన్వీనర్ మబ్బు అశోక్ వర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. అధ్యక్షతన విస్తృతస్థాయి సమావేశంనిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సమన్వయ కర్త మక్బూల్ బాషా, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్ బాషా, రాష్ట్ర నాయకులు పూల శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. సమావేశంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను, ఉద్దేశించి మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు ప్రతి గ్రామంలోనూ పార్టీ బలోపేతం చేసే దిశగా అన్ని విభాగాలకు పార్టీ నాయకత్వాన్ని భాగస్వామ్యం చేస్తూ మండల స్థాయికమిటీ లు పంచాయతీ కమిటీలు గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి పార్టీకి పూర్వ వైభవం తీసుకొని వచ్చే విధంగా నాయకులు కార్యకర్తలు కలిసి పని చేయాలని రాబోవు ఎన్నికల్లో మన జగన్ మోహన్ రెడ్డి ని ముఖ్యమంత్రి చేసుకోవాలని బియస్ మక్బూల్ కోరారు. ఈ కార్యక్రమంలో మాజి ఎమ్మెల్యే అత్తార్ చాంద్ బాషా రాష్ట్ర యాక్టివిటీ కార్యదర్శి వజ్ర భాస్కర్ రెడ్డి , రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లింగాల లోకేశ్వరరెడ్డి ,రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాస రెడ్డి , రాష్ట్ర పంచాయతీ వింగ్ సెక్రెటరీ పోరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి , జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రణీత్ రెడ్డి,సీనియర్ నాయకులు దేశాయ్ సంజీవరెడ్డి , వెంకట్రాం రెడ్డి, తనకల్లు మండలం ఎంపీటీసీలు, సర్పంచులు వార్డు మెంబర్లు మండల వైఎస్ఆర్సిపి, నాయకులు పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయ కర్త మక్బుల్

# రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్సీపీ నాయకుడు సూర్యనారాయణకు తీవ్ర గాయాలు
### పరామర్శించిన పార్టీ నేతలు ..

**బత్తలపల్లి (తెలుగోడు), జనవరి 25 :**
బత్తలపల్లి మండల పరిధిలోని తంబాపురం క్రాస్ సమీపంలో అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్సీపీ నాయకుడు బిల్లే సూర్యనారాయణ తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే... మండల కేంద్రం బత్తలపల్లికి చెందిన బిల్లే సూర్యనారాయణ వ్యక్తిగత పనిమీద ముదిగుబ్బ మండలం జొన్నకొత్తపల్లికి వెళ్లి తిరిగి ద్విచక్రవాహనంపై బత్తలపల్లికి వస్తున్నారు. ఈ క్రమంలో తంబాపురం క్రాస్ వద్దకు రాగానే అకస్మాత్తుగా కుక్కలు అడ్డురావడంతో వాటిని తప్పించే ప్రయత్నంలో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన గుంతలో పడిపోయారు. ఈ ప్రమాదంలో ఆయనకు తలకు, చేతులకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే 108 అత్యవసర సేవలకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఈఎంటి అమల, పైలట్ గంగాద్రి సంఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక చికిత్సలు అందించి గాయపడిన వ్యక్తిని ఆర్డీటి ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే వైఎస్సార్సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్?కుమార్, మాజీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, నాయకులు ఈడిగ కాశప్ప, సంద్రా రామకృష్ణ, వెంకటరాముడు, దాసరి సూరి, కొంక గాంధీ, గంగాద్రి, తలారి సురేష్ తదితరులు ఆసుపత్రికి చేరుకుని ఆయనను పరామర్శించారు. ప్రస్తుతం సూర్యనారాయణ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వైఎస్ఆర్సిపి నేత బిల్లే సూర్యనారాయణ



కెవిపిఎస్ నూతన క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

## కెవిపిఎస్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

### డి.ఎస్.పి భార్గవి..

**ఎమ్మిగనూరు (తెలుగోడు), జనవరి 25 :**
కెవిపిఎస్ నూతన క్యాలెండర్‌ను డి.ఎస్.పి భార్గవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఉపాధ్యక్షులు చిన్నప్ప,ఎస్ తిమ్మన్న , సుమల ఆంథోనీ, కలుగుట్ల రాజా రమేష్ మాట్లాడుతూ క్యాలెండర్ అంటే కేవలం తేదీలు చూసుకుని నెలలు మార్చుకోవడం కోసం కాదని గతకాలపు జ్ఞాపకాలుగా సామాజిక అభ్యుదయకారులు నిర్వహించిన పోరాటాలను అణువునా గుర్తించుకుంటూ నేటికీ మారని వ్యవస్థ మార్పు కోసం అంకితమై కృషి చేయడం కోసమే రోజువారీగా సామాజిక ఉద్యమకారులు నిర్వహించిన పోరాటాలను క్యాలెండర్లో ఉంచామన్నారు. ఎవరికి ఎక్కడ అన్యాయం జరిగినా దళితులకు మేము తోడుగా ఉంటాము అన్న ధైర్యాన్ని కెవిపిఎస్ కల్పిస్తుందని అన్నారు . క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు సుమల రాజు, గుంటెప్ప, గుడికల్ ఆనందు, అరుణ్ , కందనాతి రాజేష్, కలగొట్ల వినోద్, చినరాజు , కందనాతి.కేషన్న తదితరులు పాల్గొన్నారు.



లింగాయతి నూతన క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

## వీరశైవ లింగాయతి నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

**ఎమ్మిగనూరు (తెలుగోడు), జనవరి 25 :**
ఎమ్మిగనూరు పట్టణంలో వీరశైవ లింగాయతి కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై రుద్రగౌడ్, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు వై పురుషోత్తం గౌడ్, బి కే నాగరాజు గౌడ్ , వీరశైవ జంగమ మహేశ్వర్లు ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు నాగరాజు గౌడు, టీచర్ ఈరన్న, టీచర్ గులప్ప, ఆలే ఈరన్న, పరమేశప్ప, నాగన్న గౌడు, మౌర్యం రాజు, హరి ఎర్రకోట ముత్తన్న, నందవరం ఆదెన్న, కార్యదర్శి అడ్వకేట్ మల్లికార్జున, కోటేకల్ దేవేంద్రప్ప, టీచర్ శివ ప్రసాద్, పెద్ద కడుబూరు పంపాపతి స్వామి, రఘు, ఇంద్రసేనారెడ్డి, ఆల్వి చంద్ర శేఖర్ మరియు వీరశైవ లింగాయతులు జంగమహేశ్వర్లు పాల్గొన్నారు.

## శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు

**శ్రీశైలం (తెలుగోడు), జనవరి 25 :**
ప్రముఖ శైవ క్షేత్రంగా శక్తిపీఠంగా విరాజిల్లుతున్న శ్రీశైల మహా క్షేత్రానికి భక్తుల తాకిడి తీవ్రమైంది. దేశ నలుమూలల నుండి శ్రీశైలం చేరుకున్న భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు పోటీపడ్డారు. వరుస సెలవు రోజులు కావడంతో భక్తుల రద్దీ శ్రీశైలానికి పోటెత్తింది భక్తుల రద్దీతో పాటు భక్తులకు స్వామి అమ్మవార్ల దర్శన వేళలు మార్పులు చేయటంతో ఎక్కువ సమయం పడుతోంది. ట్రాఫిక్ ఇబ్బందులతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు శ్రీశైలం చేరుకోవడంతో వసతి కూడా ఇబ్బందికరంగా మారింది రూముల దొరక్క భక్తులు రోడ్డుపైనే కుటుంబ సభ్యులతో రాత్రంతా గడిపారు సుమారు 70 వేల మంది పైగా భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారని అంచనా.





స్వామి అమ్మవార్ల దర్శనం కోసం క్యూ లైన్‌లలో వేచి ఉన్న భక్తులు

## ఎమ్మిగనూరు జిల్లా కోసం 22వ రోజు కొనసాగిన దీక్షలు

### మంత్రి మూలింటి మారెప్ప సంఘీభావం..

**ఎమ్మిగనూరు (తెలుగోడు), జనవరి 25 :**
ఎమ్మిగనూరు జిల్లా కోసం 22వ రోజు ఎమ్మిగనూరు ప్రధాన కూడలిలో దీక్ష కొనసాగింది. మాజీ మంత్రి మూలింటి మారెప్ప ఎమ్మిగనూరు జిల్లా సాధన జేఏసీ శిబిరాన్ని సందర్శించి సంపూర్ణ సంఘీభావాన్ని తెలిపారు. ఆదోని కంటే ఎమ్మిగనూరు జిల్లా కావడానికి ఎక్కువ శాతం ఆస్కారం ఉందని తెలిపారు. ఆదోని బంద్ పిలుపునకు పెద్దగా ప్రభావం కనిపించకపోవడం చూస్తే ప్రజలు సంపూర్ణంగా తిరస్కరించినట్లు స్పష్టమైందన్నారు. ఎమ్మిగనూరు జిల్లాకి లైన్ క్లియర్ అయినట్టేనని ఎమ్మిగనూరు జేఎసి నాయకులు అభిప్రాయపడ్డారు. బంద్ వ్యతిరేకతతోనైనా అధికారులు, అధికార పార్టీ నాయకులు ఎమ్మిగనూరు గురించి ఆలోచన చేయాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదోనిలో పరిశ్రమలున్న వాణిజ్య వ్యాపార సంస్థలు ఉన్న త్రాగడానికి నీరు లేకపోవడం, ప్రభుత్వ భూములు లేకపోవడం ఆదోని జిల్లాకు ప్రభుత్వం ఆలోచన చేస్తుందని అన్ని అర్హతలు అన్ని భౌగోళిక పరిస్థితులు అనుకూలిస్తున్న ఎమ్మిగనూరు జిల్లాకు ప్రభుత్వం తప్పకుండా అంగీకరిస్తుందని జేఏసీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రాజేష్ రంగయ్య చార్లెస్ చిన్న ప్రసాద్ రాజోలప్ప గోవిందమ్మ బతుకమ్మ రాము నాని తదితరులు పాల్గొన్నారు.



దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న మాజీమంత్రి మారెప్ప

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండండి

### అవగాహన సదస్సులో సీఐ మంజునాథ్ ..

**పెద్దకడబూరు (తెలుగోడు), జనవరి 25 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని కల్లుకుంట, ముచ్చిగిరి గ్రామాలలో సైబర్ నేరాలపై ఎస్ఐ నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో కోసిగి సీఐ మంజునాథ్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. రహదారుల భద్రత, ట్రాఫిక్ నియమాల పాటింపు, ప్రమాదాల నివారణపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాల్లో సీటు బెల్ట్ వినియోగించాలన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణనష్టానికి దారి తీస్తుందని హెచ్చరించారు. అనంతరం సైబర్



సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ మంజునాథ్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ మంజునాథ్

నేరాలు మరియు సైబర్ భద్రత అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఇటీవల పెరుగుతున్న లోన్ యాప్ మోసాలు, ఐవీఆర్ఎస్ కాల్స్, లింక్?ల ద్వారా జరిగే ఆన్?లైన్ మోసాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్?కు వ్యక్తిగత సమాచారం ఇవ్వవద్దని, అనుమానాస్పద లింక్?లను ఓపెన్ చేయవద్దని స్పష్టం చేశారు. మహిళల భద్రతకు సంబంధించిన అంశాలను వివరించారు. మహిళలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సైబర్ నేరాలకు గురైన వారు వెంటనే పోలీస్ స్టేషన్?ను సంప్రదించాలని, అవసరమైతే జాతీయ సైబర్ నేరాల హెల్ప్?లైన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా వ్యవహరిస్తేనే నేరాలను నివారించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు ఇస్మాయిల్, హనుమంతు, ఆయా గ్రామాల పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

# ఆదోని జిల్లా అంశంపై వైసీపీకి మాట్లాడే హక్కు లేదు

### ఆదోని జిల్లా ఇచ్చేది, సాధించేది కూటమి ప్రభుత్వమే టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత రెడ్డి..

**పెద్దకడబూరు (తెలుగోడు), జనవరి 25 :**
ఆదోని జిల్లా అంశాన్ని రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్న వైసీపీకి ఈ విషయంపై మాట్లాడే అర్హత లేదని టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. ఆదోని జిల్లా ఏర్పాటు విషయంలో నిజాయితీ, చిత్తశుద్ధి ఉన్నది కేవలం కూటమి ప్రభుత్వానికేనని ఆయన స్పష్టం చేశారు. తాము ఆదోని జిల్లా ఏర్పాటుకు వ్యతిరేకం కాదని, ఆదోని ప్రాంత ప్రజల ఆకాంక్షకు పూర్తిగా మద్దతుగా నిలుస్తున్నామని తెలిపారు. ఆదోని జిల్లా కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని, అయితే ఈ అంశాన్ని రాజకీయ నాటకంగా మార్చే ప్రయత్నాలను సహించబోమని ఆయన హెచ్చరించారు. అధికారంలో ఉన్నప్పుడు మౌనం ఎందుకు? వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో రాష్ట్రాన్ని 26 జిల్లాలుగా విభజించినప్పటికీ ఆదోని జిల్లాపై ఒక్కసారి కూడా డిమాండ్ చేయలేదని నరవ రమాకాంతరెడ్డి గుర్తు చేశారు. అప్పట్లో మంత్రి పదవులు, వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చి, ఆదోని జిల్లా అంశాన్ని పూర్తిగా పక్కన పెట్టారని ఆరోపించారు. నిజంగా వైసీపీ నాయకులకు ఆదోని జిల్లా పట్ల చిత్తశుద్ధి ఉంటే అధికారంలో ఉన్నప్పుడే పోరాటం చేసేవారని, ప్రజల పక్షాన నిలబడి డిమాండ్ చేసేవారని అన్నారు. కానీ అప్పట్లో మౌనం పాటించి, ఇప్పుడు మాత్రం రాజకీయ లాభం కోసం జిల్లా కావాలని అడగడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. వైసీపీ నాయకుల ద్వంద్వ వైఖరిని ఆదోని ప్రాంత ప్రజలు బాగా గుర్తించారని,



మాట్లాడుతున్న టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి

వారి మాయమాటలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని స్పష్టం చేశారు. ప్రజల భావోద్వేగాలతో ఆడుకుంటూ రాజకీయ ప్రయోజనాలు పొందాలనే ప్రయత్నాలను ప్రజలు తగిన విధంగా తిప్పికొడతారని ఆయన అన్నారు. ఆదోని జిల్లా సాధన అంశాన్ని తప్పకుండా కూటమి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయం తీసుకునేలా కృషి చేస్తామని తెలిపారు. ఆదోని ప్రాంత అభివృద్ధి, ప్రజల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంతోనే ఆదోని జిల్లా సాధ్యం కూటమి ప్రభుత్వ హయాంలోనే ఆదోని జిల్లా సాధ్యం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ అంశంలో రాజకీయాలు కాకుండా ప్రజా ప్రయోజనాలే ప్రధానంగా ఉండాలని అన్నారు.

# రథసప్తమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు

### సంప్రదాయబద్ధంగా సూర్యారాధన..

**శ్రీశైలం (తెలుగోడు), జనవరి 25 :**
శ్రీశైలం మహా క్షేత్రంలో రథసప్తమి (మాఘ శుద్ధ సప్తమి) పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం నాడు ఆలయప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో సూర్యారాధన జరిపించారు. ముందుగా దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలని, జనులందరికి ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు జరగకుండా ఉండాలనీ, దేశంలో అగ్ని ప్రమాదాలు, వాహన ప్రమాదాలు జరగకుండా ఉండాలని, అన్ని సామాజిక వర్గాల ప్రజలు సుఖశాంతులతో ఉండాలంటూ ఆలయ అర్చకులు, వేదపండితులు లోక కల్యాణ సంకల్పం పఠించారు. తరువాత కలశస్థాపన చేసి కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించారు. అనంతరం వైదికాచార్యులు ఆయా బీజమంత్రాలతోనూ, ప్రత్యేక ముద్రలతోనూ సూర్యనమస్కారాలు చేసారు. ఈ కార్యక్రమంలో భాగంగానే సూర్యయంత్ర పూజ, వేదపారాయణలు, అరుణపారాయణ, జరిపించారు. అనంతరం సూర్యభగవానుడికి ఉత్తరపూజనము (షోడశోపచారపూజ), నివేదన, మంత్రపుష్పము జరిపించబడ్డాయి. మన పురాణాలలో ఈ సూర్యారాధన ఎంతో విశేషంగా చెప్పబడింది. సూర్యారాధన వల్ల అనారోగ్యం తొలగి



రథసప్తమి పూజలు చేస్తున్న ఆలయ అధికారులు అర్చక వేద పండితులు

ఆరోగ్యచేకూరుతుందని పురాణాలు చెబుతున్నాయి. ముఖ్యంగా రథసప్తమి రోజున సూర్యుని ఆరాధించడం ఎంతో ఫలదాయకం.మన్వంతర ప్రారంభంలో సూర్యభగవానుడు మాఘశుద్ధ సప్తమి రోజున మొట్టమొదటిసారిగా తన ప్రకాశాన్ని లోకాలకు అందించాడని చెబుతారు అందుకే రథసప్తమి రోజును సూర్యజయంతిగా జరుపుకోవడం ఆచారంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమములో కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు దంపతులు ఆలయ అర్చకస్వాములు, వేదపండితులు పాల్గొన్నారు.



రథసప్తమి పూజలు చేస్తున్న ఆలయ అధికారులు అర్చక వేద పండితులు

# ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

**కౌతాళం (తెలుగోడు) జనవరి 25:**
కౌతాళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సీనియర్ ఓటర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రజనీకాంత్ రెడ్డి, కౌతాళం వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు అల్లూరి వెంకటపతి రాజు , టిడిపి కౌతాళం టౌన్ అధ్యక్షులు డాక్టర్ రాజానంద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ రెడ్డి, మండల ఆర్ఐ తిక్కస్వామి, మారుతి మోహన్,టీడీపీ టౌన్ నాయకులు గిరి, గొట్టయ్య, నబి, రేవన్న, పాఠశాల ఉపాధ్యాయులు , రెవెన్యూ, సచివాలయం ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న తహసీల్దార్ రజనీకాంత్ రెడ్డి , అల్లూరి వెంకట పెద్దిరాజు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సుధాకర్ రెడ్డి మండల ఆర్ఐ తిక్కయ్య స్వామిని సన్మానిస్తున్న మారుతి మోహన్




విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం



కుసుమన్న మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

## టిడిపి నేత కుసుమన్న మృతి

### కుటుంబానికి అండగా టీడీపీ

**పెద్దకడబూరు (తెలుగోడు), జనవరి 25 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని కంబదహాల్ గ్రామానికి చెందిన కుసుమన్న అనారోగ్య కారణంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న మంత్రాలయం టీడీపీ ఇంచార్జ్ రాఘవేంద్ర రెడ్డి అనుచరుడు ఆదివారం టీడీపీ మండల క్లస్టర్ ఇంచార్జ్ మురళీకృష్ణ మృతుడి కుటుంబాన్ని పరామర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి, పార్టీ తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు.



రాస్తారోకో నిర్వహిస్తున్న దృశ్యం

## కౌతాళంలో బంద్ విజయవంతం

**కౌతాళం (తెలుగోడు), జనవరి 25 :**
ఆదోని జిల్లా సాధన కోసం చేపట్టిన బంద్ కౌతాళంలో విజయవంతం అయింది. కౌతాళం జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యుల పిలుపు మేరకు నాయకులు, ప్రజలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. జిల్లా ఏర్పాటుతో ఆదోని నియోజకవర్గంతో పాటు ఎమ్మిగనూర్, మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. వ్యవసాయ భూములకు సాగునీరు పరిశ్రమలు ఇలా అన్ని రకాల సేవలు కావాలంటే ఆదోని జిల్లా కావాల్సిందే అన్నారు. బంద్‌లో భాగంగా కౌతాళం హైస్కూల్ నుండి వైఎస్ఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్మించారు. బంద్‌కు కౌతాళంతో పాటు మండలంలో ఉన్న అన్ని గ్రామాల ప్రజలు, వివిధ కమ్యూనిష్టు పార్టీల ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలలు వ్యాపారస్తులు హోటల్ యజమానులు, షాపులు, కిరాణి షాపుల ఎలు, కాయగూరలు అమ్మే వ్యాపారస్తులు బందుకు పూర్తిగా సహకరించారు. బంద్‌కు సహకరించిన వారికి కౌతాళం జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.



బంద్ పాటిస్తున్న నాయకులు

## రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

### ఎస్ఐ రమేష్ రెడ్డి..

**కోసిగి(తెలుగోడు)జనవరి 25:**
కోసిగి మండల పోలీస్ స్టేషన్లో పరిధిలోని రౌడీషీటర్లకు కోసిగి ఎస్సై రమేష్ రెడ్డి కౌన్సెలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాలలో ఎలాంటి విభేదాలు, లైంగిక నేరాలకు,గొడవలకు పాల్పడకూడదని,చట్టపరంగా జీవించాలని వారు తెలిపారు. భవిష్యత్తులో పదేపదే ఇటువంటి నేరాలు గాని ఏ ఇతర నేరాలకు పాల్పడినచో తిరిగి రౌడీషీట్ ఓపెన్ చేయడం జరుగుతుందని,పిడి యాక్ట్ అమలు చేయడం,సంబంధిత చట్టాలను ఉపయోగించి కఠిన శిక్షలు పడేవిధంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ రమేష్ రెడ్డి

# ఉత్తమ సేవలకు ప్రశంసాపత్రాలు

**సీఐ నగేష్ బాబు..**
**కానిస్టేబుల్ నాగేంద్ర ..**

**ముద్దనూరు (తెలుగోడు), జనవరి 25 :**
జమ్మలమడుగు నియోజకవర్గంలోని పలు పోలీస్ స్టేషన్‌లలో విధులు నిర్వహిస్తున్న ఇరువురి పోలీసులు ఉత్తమ సేవ, ప్రశంసాపత్రాలు అందుకోనున్నారు. స్థానిక యుజి పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న సిఐ నాగేష్ బాబు, కొండాపురం స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ నాగేంద్ర ఈ అవార్డుకు ఎంపికైనారు. కడప పోలీస్ పేరేడ్ మైదానంలో సోమవారం జరుగనున్న రిపబ్లిక్ దే వేడుకల్లో కలెక్టర్ నుంచి వీరు ప్రశంసాపత్రాలు అందుకోనున్నారు. సిఐ నాగేష్ బాబు, కానిస్టేబుల్ నాగేంద్ర సేవ పత్రాన్ని అందుకోవడం పట్ల ముద్దనూరు, కొండాపురం, ప్రజా ప్రతినిధులు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు







విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న బి ఎల్ వో దామోదర్ నాయుడు

# మనిషి చరిత్రను తిరగరాసేదే ఓటుహక్కు

**జాతీయ ఓటర్ల దినోత్సవం ప్రతిజ్ఞ ..**

**యాడికి (తెలుగోడు), జనవరి 25 :**
ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని,మనిషి చరిత్రను తిరిగి రాసేదే ఓటు హక్కు మాత్రమే నని బిఎల్ఓ లు విద్యార్థినిలకు తెలియజేశారు. ఆదివారం జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని యాడికి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో వీఆర్వో. బి ఎల్ వోలు దామోదర్ గౌడ్ విద్యార్థులకు ఓటర్ల దినోత్సవం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే పంచాయతీ కార్యాలయంలో బిఎల్వోలు పాండురంగ. హరి నారాయణ. సాయి తేజ. సంజీవులు ప్రజలకు అవగాహన కలిగిస్తూ ప్రతిజ్ఞ చేయించారు . ఈ సందర్భంగా ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, సామాన్య పౌరుడు కూడా ఉన్నత స్థాయికి ఓటు హక్కు చేర్చుతుందన్నారు. ముఖ్యంగా మనిషి యొక్క చరిత్రను ఒక్క ఓటు హక్కుతో తిరిగి రాసేయచ్చు అన్నారు. 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును పొందాలన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే, మంచి నాయకున్ని ఎన్నుకోవాలంటే ఒక్క ఓటు హక్కుతోనే సాధ్యమన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు ఎంతో విలువైనదని, టీ అమ్ముకునే వ్యక్తి నేడు దేశాన్ని పరిపాలిస్తున్నారని గుర్తు చేశారు. స్వచ్ఛమైన పాలన కోసం మంచి నాయకున్ని ఓటు హక్కుతో ఎన్నుకోవచ్చునన్నారు. ఎన్నికల్లో మీ తల్లిదండ్రులను కచ్చితంగా ఓటు హక్కును వినియోగించుకోనే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. బి ఎల్ ఓ లు.ప్రజలు. విద్యార్థినులతో కలసి జాతీయ ఓటర్ల దినోత్సవం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో బి ఎల్ వో లు దామోదర్ నాయుడు. పాండురంగ.హరి నారాయణ. సాయి తేజ. సంజీవులు విద్యార్థినిలు. ప్రజలు పాల్గొన్నారు.



పంచాయితీ కార్యాలయం లో బి ఎల్ వో లు ప్రజలతో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

# పరిశ్రమల ఏర్పాటుకు సహకరించండి

**ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ..**

**రామకుప్పం (తెలుగోడు), జనవరి 25 :**
సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో మండలంలోని బందార్లపల్లి పంచాయతీ పరిశ్రమల ఏర్పాటుకు భూమి రైతులు సహకరించాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు కోరారు. ఆదివారం మండల కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పరిశ్రమంలో ఏర్పాటుతో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. రైతులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో భూ సేకరణ చేపట్టాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి పరిశ్రమలు ఏర్పాటుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, టిడిపి మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ ఆనంద రెడ్డి, కార్యదర్శి కామరాజు నాయక్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు నరసింహులు, నేతలు కృష్ణా నాయక్, గంట్లప్ప గౌడు, కన్నన్, వెంకట్రామ గౌడు, జయశంకర్, విశ్వనాథ్, రవిరెడ్డి, రఘు, ఆదిల్ , మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.



పరిశ్రమల ఏర్పాటుపై సమీక్షిస్తున్న కూటమి నేతలు

## పార్టీ సిద్ధాంతాలతో నిత్యం జనంలోనే.. ఉమ్మడి కడప జిల్లా డీసీసీబి చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి..

**బద్వేల్ బద్వేల్ రాజకీయాల్లో నాడు ఒక్కడే..**

# నేడు అతడే ఒక సైన్యం..

**బద్వేల్ (తెలుగోడు), జనవరి 25 :**
నాడు ఒక్కడే.. నేడు అతడే ఒక సైనికుడయ్యాడు. పదవి కంటే ప్రజలే ముఖ్యం.. అనే సిద్ధాంతంతో వెన్నుపోటు రాజకీయాలకు భయపడకుండా అధినేత చంద్రబాబు నాయుడు, యువ నాయకుడు నారా లోకేష్ సారథ్యంలో ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్‌గా, ప్రజా నాయకుడిగా బద్వేల్ అభివృద్ధికి బాటలు వేస్తున్నారు డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి.



2024 ఎన్నికల్లో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అసెంబ్లీఇంచార్జ్ ఆశించి, రాకపోయినప్పటికీ ఏమాత్రం విశ్వాసం కోల్పోకుండా.. ఎన్ని అడ్డంకులు ఎదురైనా చెక్కుచెదరని ఆత్మవిశ్వాసంతో నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న ప్రజా నాయకుడు ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి అని చెప్పడంలో సందేహం లేదు. రాజకీయ జీవితంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని, పోరాటాల ధీరుడిగా బద్వేల్ నియోజకవర్గంలో అతి తక్కువ కాలంలోనే తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డిపై తెలుగోడు ప్రత్యేక కథనం.

అభిమానిగా, ఆరాధ్య కథానాయకుడిగా దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్, మరో దివంగత మాజీ మంత్రి బిజి వేముల వీరారెడ్డిని మొదటి నుండి ప్రేమిస్తూ.. అనుసరిస్తూ వచ్చిన మంచూరు సూర్యనారాయణ రెడ్డి తెలుగుదేశం పార్టీ అధినేత లెజెండరీ నాయకుడైన చంద్రబాబు నాయుడు కోసం విలువలతో కూడిన రాజకీయ నేతగా పార్టీ కోసం పనిచేస్తూ వచ్చారు. బద్వేల్ నియోజకవర్గంలో దక్షిణ మధ్య రైల్వే క్లాస్ వన్ కాంట్రాక్టర్ గా బలమైన రెడ్డి వర్గానికి చెందిన ఆయన నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్ నేతృత్వంలో తెలుగుదేశం పార్టీ నుండి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి పార్టీని క్షేత్రస్థాయిలో బలపడడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు. పార్టీ పట్ల ఆయనకు ఉన్నటువంటి నిజాయితీని, పనితనాన్ని గుర్తించిన అధినేత చంద్రబాబు నాయుడు ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ గా నియమించారు. ఎన్నికల సమయంలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆయన తనయుడు నారా లోకేష్ పాదయాత్ర సమయంలో కుప్పం నుండి బద్వేల్ నియోజకవర్గం లో అడుగుపెట్టింది మొదలు, ఆయన వెంట ఉంటూ తిరుగు ప్రయాణం అయ్యేంతవరకు ఆయనకు రక్షణగా, భారీ జన సమీకరణతో ఘన స్వాగతాలను సైతం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. మరోవైపు పసుపు పార్టీ శ్రేణుల అందరి సహకారంతో సభ్యత్వాల నమోదులో బద్వేల్ ను రాష్ట్రస్థాయిలో నిలబెట్టి చరిత్రను తిరగ రాశారు. బద్వేల్ రాజకీయాల్లో తనకంటూ ఎటువంటి బ్యాక్ గ్రౌండ్ లేనప్పటికీ నాడు ఒక్కడిగా అడుగుపెట్టి.. నేడు అతడే ఒక సైనికుడై పసుపు శ్రేణులతో కలిసి ముందుకు సాగుతున్నాడు. ఎవరి తోను వ్యక్తిగత విభేదాలు లేకుండా సిద్ధాంతాల కోసం, అభివృద్ధి కోసం పరితపించే ఆయన అంటే పలు పార్టీలకు చెందిన రాజకీయ నాయకుల సైతం అభిమానించే విధంగా ఆయన పేరు తెచ్చుకున్నారు. కార్యకర్త స్థాయి నుండి నాయకుడు స్థాయికి వచ్చిన ఆయన కార్యకర్తల కోసం అవసరమైతే ఏదైనా చేసేందుకు ముందు వరుసలోనే



ఉండే వ్యక్తిత్వం ఆయనది. తాను కూడా కార్యకర్తగా కష్టపడి పైకి వచ్చిన సందర్భాలను ఎప్పటికప్పుడు గుర్తు చేసుకుంటూ నాయకులతో పాటు కార్యకర్తలకు కూడా సమాన గౌరవం ఇవ్వడం ఆయన వద్దనే చూడవచ్చు అని చెప్పడంలో సందేహం లేదు.





# జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ

## సీనియర్ ఓటర్లకు సన్మానం .. రెవెన్యూ డివిజన్ అధికారి చంద్రమోహన్.. సీనియర్ సివిల్ జడ్జి వైజే పద్మశ్రీ..

**బద్వేల్ (తెలుగోడు), జనవరి 25 :**
16వ జాతీయ ఓటర్ దినోత్సవం కార్యక్రమాన్ని బద్వేల్ రెవెన్యూ డివిజనల్ అధికారి, ఓటర్ నమోదు అధికారి ఏ.చంద్రమోహన్ అధ్యక్షతన నిర్వమించారు. జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బద్వేల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు జడ్జి వైజే పద్మశ్రీ పాల్గొన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బద్వేల్ పట్టణంలో ర్యాలీ నిర్వహించి ఓటర్ల ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం సీనియర్ ఓటర్లను గుర్తించి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ నియోజకవర్గపరిధిలో ఉన్న మండలాల తహసీల్దార్లు, అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, ఎలక్షన్ డిప్యూటీ తహసిల్దార్,బద్వేల్, ఎలక్షన్ ఆపరేటర్లు, ఎలక్షన్ సూపర్వైజర్లు,



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బూత్ లెవెల్ అధికారులు పాలొన్నారు. ఈ ఎన్నికల విధులకు సంబంధించి ప్రతిభ కనబరిచిన బూత్ లెవెల్ అధికారులు, ఎలక్షన్ ఆపరేటర్లు, ఎలక్షన్ సూపర్వైజర్లు మరియు తాసిల్దారులకు గౌరవ జడ్జి ద్వారా మరియు ఆర్డీవో ద్వారా మెమొంటోలు మరియు మెరిట్ సర్టిఫికెట్లు ప్రధానం చేశారు.






సీనియర్ సిటిజన్లను సన్మానిస్తున్న రెవెన్యూ డివిజన్ అధికారి చంద్రమోహన్, సీనియర్ సివిల్ జడ్జి వైజే పద్మశ్రీ

# నేడు భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు

**ముద్దనూరు (తెలుగోడు), జనవరి 25 :**
దేశమంతా దేశ ప్రజాస్వామ్య 77వ గణతంత్ర దినోత్సవాలు ఘనంగా సోమవారం జరుపుకోనున్నారు. భారతదేశ చరిత్రలో జనవరి 26 ఒక అత్యంత విశిష్టమైన రోజు. 1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమలులోకి రావడంతో, భారత్ ఒక సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర దేశంగా అవతరించింది. ఈ రోజు భారత ప్రజలకు పరిపూర్ణ స్వయంపాలన హక్కు లభించిన చారిత్రక ఘట్టానికి ప్రతీక. స్వాతంత్ర్యం మనకు స్వేచ్ఛను ఇచ్చినప్పటికీ, ఆ స్వేచ్ఛను మన స్వహస్తాలతో లిఖించి, సక్రమంగా వినియోగించుకునే మార్గదర్శకమే రాజ్యాంగం. డా. బి.ఆర్. అంబేద్కర్ నాయకత్వంలో రూపొందిన భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగంగా గుర్తింపు పొందింది. ఇది ప్రతి పౌరుడికి సమాన హక్కులు, న్యాయం, స్వేచ్ఛ, గౌరవాన్ని హామీ ఇస్తుంది.

గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా జాతీయ జెండా ఆవిష్కరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యాసంస్థల్లో ప్రత్యేక వేడుకలు నిర్వహించబడతాయి. న్యూఢిల్లీలోని రాజ్?పథ్ (కర్తవ్య పథ్) లో నుండి ప్రతి ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయంలో ఘనంగా జరుపుకుంటూ మా చట్టాలతో మేము నడుస్తున్నా ము అని ప్రతి భారతీయుడు తలెత్తుకొని నిలబడే రోజుగా అభివర్ణించుకుంటాము. మన విజయోత్సవాలు దేశ రాజధాని లో గణతంత్ర దినోత్సవ పరేడ్ భారత సైనిక శక్తిని, రాష్ట్రాల సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెబుతుంది.

ఈ రోజు మనకు ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇస్తుంది. హక్కులతో పాటు బాధ్యతలు కూడా అంతే ముఖ్యమని. దేశాన్ని ప్రేమించడం అంటే మాటలతో కాదు, చట్టాలను గౌరవించడం, ఐక్యతను కాపాడడం, నిజాయితీగా జీవించడం ద్వారానే సాధ్యమవుతుంది. వైవిధ్యంలో ఐక్యత




రాజ్యాంగాన్ని స్వీకరిస్తున్న మహనీయులు

భారతదేశానికి ప్రధాన బలం. భాషలు, మతాలు, సంస్కృతులు వేర్వేరు అయినా మనందరినీ ఒక్కటిగా కట్టిపడేసేది భారత రాజ్యాంగమే. ఈ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతి భారతీయుడు దేశాభివృద్ధికి తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని సంకల్పించాలి. అదే నిజమైన గణతంత్ర దినోత్సవానికి అర్థం.





ఆనాడు చట్టసభలో రాజ్యాంగాన్ని ప్రవేశపెడుతున్న మహనీయులు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

# 10 కుటుంబాలు టిడిపిలో చేరిక

**పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే విజయమ్మ..**

**బద్వేల్ (తెలుగోడు), జనవరి 25 :**
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఆదివారం బద్వేల్ నియోజకవర్గం లోని అట్లూరు మండలం మాడ పూర్ గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి పార్టీ నుండి 10 కుటుంబాలు అట్లూరు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పాపుదిప్పు. మల్లికార్జున్ రెడ్డి, పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్తపు ముని రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పలువురికి టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.మాడపూర్ గ్రామానికి చెందిన కుప్పం పెద్ద సుబ్బారెడ్డి, రమణారెడ్డి, శేఖర్ రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, రమణారెడ్డి తోపాటు మరో కొందరు టిడిపి పార్టీలో చేరారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు మద్దిక పుల్లారెడ్డి, సీనియర్ నాయకులు అల్లం వెంకటసుబ్బయ్య, రెడ్డి చర్ల గంగాగిరి రాజు, స్టేట్ ఆర్యవైశ్య కార్పొరేషన్ అండ్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పరిటాల వెంకటసుబ్బయ్య, సింగం పల్లె శివయ్య స్వామి తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.




జాతీయ ఓటు హక్కు దినోత్సవం ర్యాలీ చేపడుతున్న కూటమి నేతలు


# ఓటు హక్కు అందరి బాధ్యత

**ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ..**

**రామకుప్పం (తెలుగోడు), జనవరి 25 :**
అర్హులైన యువతీ, యువకులందరూ ఓటు హక్కు అందరి బాధ్యతగా వినియోగించుకోవాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు పేర్కొన్నారు.ఆదివారం రామకుప్పంలో ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేపట్టారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజా ప్రతినిధులను చట్టసభలకు పంపేందుకు ప్రజలకు ఓటు హక్కు ఆయుధమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నేతల మునస్వామి, నారాయణ చారి, టిడిపి మండల అధ్యక్షుడు మాజీ అధ్యక్షులు వెంకటరమణ ,ఆనంద రెడ్డి, కార్యదర్శి కామరాజు, నాయక్, నరసింహులు, కృష్ణ నాయక్, వెంకటరామ గౌడు, కన్నన్, విశ్వనాథ్, జయశంకర్,రవి రెడ్డి, చంద్రకళ, అవినాష్ రెడ్డి, ఆదిల్, మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల దినోత్సవం పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

**రామకుప్పం (తెలుగోడు), జనవరి 25 :**
జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థిని సాన కౌసర్ మంచి ప్రతిభ కనబరిచింది. ఆదివారం జిల్లా కేంద్రంలో వ్యాసరచన పోటీల్లో మూడవ బహుమతి సాధించినట్లు ప్రధాన ఉపాధ్యాయులు భగవత్ గీత తెలిపారు. ఓటు హక్కు ప్రాధాన్యత, ప్రజాస్వామ్య విలువలు పై అవగాహన పెంపొందించడంలో ఇటువంటి పోటీలు ఎంతో దోహదపడుతుందని తెలిపారు.సనా కౌసర్‌ను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఘనంగా అభినందించారు. ఎంఈఓలు మల్లికార్జున, నారాయణ హర్షం వ్యక్తం చేశారు.



జిల్లా కేంద్రంలో ఉత్తమ అవార్డు అందిస్తున్న అధికారులు



ఐక్యత చాటుతున్న గ్రామ సర్వేయలు

# గ్రామ సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలి

**రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ బూరాడ మధుబాబు..**
**ప్రధాన కార్యదర్శి ఎం. మహేష్ నాయుడు..**

**రోళ్ల (తెలుగోడు), జనవరి 25 :**
రాష్ట్రంలోని గ్రామ సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ బూరాడ మధుబాబు, ప్రధాన కార్యదర్శి ఎం. మహేష్ నాయుడు డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ బూరాడ మధుబాబు, ప్రధాన కార్యదర్శి వీ మహేష్ నాయుడు, రాష్ట్ర కార్యవర్గం, 28 జిల్లాల నాయకులతో సుమారు 2500 మంది సభ్యుల సమావేశంలో తీర్మానం చేసినట్లు రత్నగిరి సర్వేయర్ కార్తీక్ తెలిపారు.తిరుపతి మహా ప్రస్థానంలో భాగంగా సర్వేయర్లు తమ ప్రధాన డిమాండ్లను వివరిస్తూ ఒక తీర్మానాన్ని ఆమోదించారు. పే పారిటీ గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థలో తమతో పాటు రిక్రూట్ అయిన ఇతర విభాగాల ఉద్యోగుల మాదిరిగా 5 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసిన గ్రామ సర్వేయర్లకు సమాన పే-రోల్తో కనీస బేసిక్ పే ?32,000 మంజూరు చేయాలని, గ్రేడ్-1 పోస్టుల మంజూరు: గ్రేడ్-1 పదోన్నతి జిల్లా వారీగా 70 శాతం వరకు గ్రేడ్-1 ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. గ్రామ సర్వేయర్ని కనీస విద్యార్హత డిప్లొమా గా సవరించవలెను మరియు రీ-సర్వేలో క్యూ జి ఐ ఎస్ , సి ఓ ర్ ఎస్ , ఆటోకాడ్ వంటి సాంకేతిక నైపుణ్యాలు గల గ్రామ సర్వేయర్ల సేవలను గుర్తిస్తూ టెక్నికల్ పే స్కేల్ మంజూరు చేయాలన్నారు. ఉద్యోగుల విలీనం రేషనలైజేషన్ ప్రక్రియలో భాగంగా, 4722 మంది గ్రామ సర్వేయర్లను సర్వే సంబంధిత శాఖలలో కౌన్సిలింగ్ విధానంలో విలీనం చేయాలన్నారు. రీ-సర్వే విధులకు అవసరమైన లాప్టాప్లు, రోవర్లు స్టేషనరీని తగిన మోతాదులో సరఫరా చేయాలన్నారు. రీ-సర్వే విధులకు సంబంధించిన పెండింగ్ (ప్రయాణ భత్యం/ కరువు భత్యం) ఇతర బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. రీ-సర్వే పై ఒత్తిడి చేయకుండా ఎస్ ఓ పి ప్రకారం నిర్దిష్ట కాలవ్యవధిని నిర్ణయించి, తగిన సమయం ఇవ్వాలి. సంబంధిత అధికారులు తమ తమ పాత్రలను బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తే భూ వివాదాలు రికార్డు లోపాలు నివారించవచ్చు, నాణ్యమైన రికార్డులు తయారు చేయుటకు సాధ్యమౌతుందన్నారు. జాయింట్ ఖాతాల తొలగింపు (జాయింట్ ఎల్ పి ఎం ) పట్టాదారులను నిర్ణయించడం వంటి రెవెన్యూ అధికారుల విధులను, జాబ్ చార్టు విరుద్ధంగా తమపై రుద్దుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం నుండి రాత్రి వరకు పనిచేస్తున్నా, మెమోలు మరియు షోకాజ్ నోటీసులు మరియు సస్పెన్షన్స్ చేస్తూ వేధిస్తున్నారని వాపోయారు. అధిక హాజరు, పే పారిటీ, ప్రమోషన్లు టెక్నికల్ అలవెన్సు వంటి డిమాండ్లు పరిష్కరించాలన్నారు. సమస్యలు పరిష్కారమయ్యేం వరకు జనవరి 27, 2026 నుండి అన్ని రీ-సర్వే విధులను నిలిపివేయాలని నిర్ణయం తీసుకున్నట్లు వారు తెలిపారు.



వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

# పలు శుభకార్యాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

**రోళ్ల (తెలుగోడు), జనవరి 25 :**
రోళ్ల లక్ష్మి ప్యాలేస్లో జరిగిన జిజి హాట్టి గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకులు కుమార్తె వివాహ వేడుకల్లో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొని వదువరులను ఆశీర్వదించగా అదేవిదంగా అగళి ఆర్ కె కల్యాణమండపం లో జరిగిన వివాహ వేడుకల్లోను కార్పెహళ్లి లో జరిగిన గృహప్రవేశం కార్యక్రమం లోను, అనంతరం శిర పట్టణం లో జరిగిన వివాహ వేడుకలో పాల్గొన్నారు. అనంతరం అమరాపురం మండలం శివరం గొల్లహట్టి లో జరిగిన వివాహ వేడుకలు లో పాల్గొని నవ వదు వరులను ఆశీర్వాదంచారు. అనంతరం గుడిబండ మండలం హిరెతుర్పి గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవంలోను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి,మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తి,జడ్పిటిసి ఉమేష్,రాష్ట్రా వక్కలిగా సాధికార కన్వీనర్ వీఎం పాండురంగప్ప,జిల్లా ఆర్గనైజషన్ సెక్రటరీ శ్రీనివాస్,మండల కన్వీనర్లు జి కె ఈరన్న, తిప్పేస్వామి, సింగల్ విండో అధ్యక్షులు దాసిరెడ్డి, క్లస్టర్ కో కన్వీనర్ శివన్న,యువ నాయకులు ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పయ్యావుల కేశవ్ను సన్మానిస్తున్న నాయకులు

# శ్రీ సూర్యనారాయణ స్వామిని దర్శించుకున్న మంత్రి పయ్యావుల కేశవ్

**మంత్రి కేశవ్ కు ఘన స్వాగతం...**

**బెళుగుప్ప (తెలుగోడు), జనవరి 25 :**
అనంతపురం జిల్లాలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన, ఉరవకొండ మండలంలోని బూదగవి గ్రామంలో కొలువైన శ్రీ శ్రీ సూర్యనారాయణ స్వామిని ఆదివారం రథసప్తమి సందర్భంగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ ను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. పూజలు అనంతరం మంత్రి పర్యావల కేశవ్ ను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు స్వామివారి చిత్రపటాన్ని అందించి, పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సత్కరించారు..



రథసప్తమి సందర్భంగా బూదగవిలో కొలువైన శ్రీ సూర్యనారాయణ స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

# పోలీసు సేవలతో ప్రజారోగ్యానికి భరోసా

## సికెపల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం.. వేలాదిగా తరలివచ్చిన ప్రజలు..

**చెన్నేకొత్తపల్లి (తెలుగోడు), జనవరి 25 :**
శ్రీ సత్య సాయి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రామగిరి సర్కిల్ పరిధిలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. రామగిరి, కనగానపల్లి, చెన్నే కొత్తపల్లి మండలాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి వైద్య సేవలు పొందారు. సికె పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ప్రారంభించారు. శిబిరం నిర్వహణను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ ప్రజల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించారు.
ఈ మెగా వైద్య శిబిరంలో గుండె సంబంధిత వ్యాధులు, షుగర్, బీపీ, థైరాయిడ్, ఎముకల సమస్యలు, కంటి, పంటి వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. ఖర్చుతో కూడుకున్న ఈసీజీ పరీక్షలను కూడా పూర్తిగా ఉచితంగా అందించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. భారీగా తరలివచ్చిన ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా భోజనం, తాగునీరు, నీడ వసతులు ఏర్పాటు చేసి పోలీసు యంత్రాంగం సమర్థంగా ఏర్పాట్లు చేసింది.
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ రామగిరి సర్కిల్ పరిధిలోని ప్రజలు ఎక్కువగా వ్యవసాయం, కూలి పనులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, అనారోగ్యం వచ్చినప్పుడు అనంతపురం,



వైద్యులు, రోగితో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్


బెంగళూరు, హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లడం కష్టమవుతోందని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో గ్రామ స్థాయిలో వైద్య శిబిరాలు నిర్వహించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు.
చిన్నపాటి జబ్బులకే పరిమితం కాకుండా తీవ్రమైన వ్యాధులను ముందుగానే గుర్తించి చికిత్స చేయించుకునేలా ఈ వైద్య శిబిరం ఉపయోగపడుతోందన్నారు. గుండె శస్త్ర చికిత్సలు అవసరమైన రోగులను గుర్తించి ఆసుపత్రిలో తక్కువ వ్యయంతో చికిత్స అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కంటి, పంటి శస్త్ర చికిత్సలు కూడా ఉచితంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మారుతున్న జీవనశైలిలో ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, మంచి ఆహారపు అలవాట్లు, క్రమబద్ధమైన జీవితం ఆరోగ్యానికి కీలకమని సూచించారు. జిల్లావ్యాప్తంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంచుతామని తెలిపారు.
కిమ్స్ సవేరా ఆసుపత్రి వైద్యులు మాట్లాడుతూ పోలీసు శాఖ సహకారంతో ఈ మెగా వైద్య శిబిరం నిర్వహించడం సంతోషంగా ఉందని, ప్రజలు ఇటువంటి ఉచిత వైద్య అవకాశాలను పూర్తిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రామగిరి సీఐ శ్రీధర్, వైద్యులు ఆదిశేషు, సికె పల్లి, కనగానపల్లి, రామగిరి మండలాల ఎస్సైలు సత్యనారాయణ, రిజ్వాన్, ప్రదీప్ రాజ్, కిమ్స్ సవేరా సిబ్బంది, పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# గౌడన్నకుంటలో రథసప్తమి విశేష పూజలు

**అమరాపురం (తెలుగోడు), జనవరి 25 :**
మండల పరిధిలో గౌడన్నకుంట గ్రామంలో వెలిసిన శ్రీ కెంచమాంబా దేవి ఆలయంలో శ్రీ కెంచమాంబ దేవి, శ్రీ సూర్యనారాయణ స్వామికి రథసప్తమి సందర్భంగా అభిషేకం, కుంకుమార్చన, పంచామృత అభిషేకం, సోడా సోపాచార , విశేష పూజలు అర్చకులు చిదానంద స్వామి వైభవంగా నిర్వహించారు. శ్రీ కేంచమాంబ దేవికి, శ్రీ సూర్యనారాయణ స్వామికి , నవగ్రహ ఆరాధన పూజలు ,పూలతో అలంకరణ చేసి వచ్చిన భక్తాదులకు మహా మంగళ హారతి, తీర్థప్రసాదాలు. అందజేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. . సేవా కర్తలు కర్ణాటక మరద



రథసప్తమి పూజలు నిర్వహిస్తున్న ఈశ్వరప్ప కుటుంబీకులు



శ్రీ సూర్యనారాయణ స్వామికి విశేష పూజలు అలంకరణ
శ్రీ కెంచమాంబా దేవికి పూలతో అలంకరణ

సనపల్లి ఈశ్వరప్ప కుటుంబీకులు చే పూజలు నిర్వహించారు. శ్రీ కెంచమాంబ దేవి కి. చుట్టుప్రక్కల గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని. మొక్కుబడులను తీర్చుకున్నారు. వచ్చిన భక్తాదులకు అన్నదానం నిర్వహించారు

# పార్టీ బలోపేతమే లక్ష్యం

## వైయస్సార్సీపీ సమన్వయకర్త బి.ఎస్. మక్బూల్..

**కదిరి (తెలుగోడు), జనవరి 25 :**
వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని వైయస్సార్సీపీ సమన్వయకర్త బి.ఎస్. మక్బూల్ అన్నారు. తనకల్లు మండలంలో ఆదివారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. మండల వైయస్సార్సీపీ కన్వీనర్ మబ్బు అశోక్ వర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి కదిరి నియోజకవర్గ వైయస్సార్సీపీ సమన్వయకర్త బి.ఎస్. మక్బుల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బి.ఎస్. ల్ మక్బూల్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పార్టీ క్యాడర్?ను అన్ని విభాగాలకు భాగస్వామ్యం చేస్తూ మండల స్థాయి కమిటీలు, పంచాయతీ కమిటీలు, గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేసి రాబోయే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు.
ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్ బాషా, రాష్ట్ర ఆక్టివిటీ కార్యదర్శి వజ్ర భాస్కర్ రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లింగాల లోకేశ్వరరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర పంచాయతీ వింగ్ సెక్రటరీ పోరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రణీత్ రెడ్డి, సీనియర్ నాయకులు దేశాయ్ సంజీవరెడ్డి, వెంకట్రాం రెడ్డి పాల్గొన్నారు. అలాగే తనకల్లు మండల ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డు సభ్యులు, మండల వైయస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

**నంబులపూలకుంటలో..**
ఎన్?పీ కుంట మండల కేంద్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం కదిరి నియోజకవర్గ వైసిపి ఇంచార్జి బిఎస్ మక్బూల్, రాష్ట్ర స్థాయి పర్యవేక్షకుడు డా బత్తల హరిప్రసాద్ ఆధ్వర్యంలో కొనసాగింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకెళ్లాలని నేతలు స్పష్టం చేశారు. మండల కన్వీనర్ రంగారెడ్డి నేతృత్వంలో మండల



తనకల్లు మండలంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బి ఎస్ మక్బూల్

కమిటీలు, పంచాయతీ కమిటీలు, గ్రామ కమిటీల ఏర్పాటు వేగవంతం చేయాలని నిర్ణయించారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ పార్టీ కేడర్?ను సమన్వయం చేస్తూ పూర్వ వైభవాన్ని తిరిగి తీసుకురావాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా నిలబెట్టడమే లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని నేతలు వివరించారు. అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సంక్షేమం చేరిందని గుర్తుచేశారు.
పార్టీ ఆవిర్భావం నుంచి కష్టకాలంలోనూ జెండానే అజెండాగా భావించి పనిచేసిన వారికే గ్రామ కమిటీల్లో ప్రాధాన్యం కల్పిస్తామని బి ఎస్ మక్బూల్ తెలిపారు. అలాంటి కేడర్ ద్వారానే భవిష్యత్తులో అధికారంలోకి వచ్చి ప్రజలకు మరింత సేవ చేయడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్ బాషా, రాష్ట్ర స్థాయి కార్యకలాపాల కార్యదర్శి వజ్ర భాస్కర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాస రెడ్డి, సీనియర్ నేత జగదీశ్వర్ రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లింగాల లోకేశ్వరరెడ్డి, రాష్ట్ర పంచాయతీ విభాగ కార్యదర్శి పోరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, జడ్పీటీసీ బాలకృష్ణ, ఎంపీటీసీలు, ఎంపీపీలు, ఉప ఎంపీపీలు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు, నూతన వైఎస్ఆర్ గ్రామ కమిటీ అధ్యక్షులు, ఎన్?పీ కుంట మండల పార్టీ నాయకులు, అభిమానులు, జగనన్న వీరాభిమానులు భారీగా పాల్గొన్నారు.



ఎన్ పి కుంటలో సమావేశానికి వెళ్తున్న వైసీపీ శ్రేణులు.. కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బత్తల హరి



మాల్యంలో సుంకులమ్మ దేవి రథోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

# కన్నుల పండువగా సుంకులమ్మ దేవి రథోత్సవం

**భక్తులతో కిటకిటలాడిన మాల్యం గ్రామం**

**కనేకల్ (తెలుగోడు), జనవరి 25 :**
మండల పరిధిలోని మాల్యం గ్రామంలో వెలసిన శ్రీ సుంకులమ్మ దేవి రథోత్సవ వేడుకలు ఆదివారం కన్నుల పండుగగా జరిగాయి. ఉదయం నుండి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం భక్తుల నడుమ అమ్మవారి రథోత్సవాన్ని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కళాకారుల నృత్య ప్రదర్శనలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. చిన్నపల్లెలచే చెక్కభజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు శరభన్నగౌడ మహేష్ గౌడ, బీజేపీ పార్టీ నాయకులు విజయ్ స్వామి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, పోలీసు వారు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



ఊరేగింపు నిర్వహిస్తున్న గంగపుత్రులు

# ఘనంగా అంబిగర చౌడయ్య జయంతి వేడుకలు

**కనేకల్ (తెలుగోడు), జనవరి 25 :**
కనేకల్ పట్టణంలో శ్రీ నిజ శరణ అంబిగర చౌడయ్య జయంతి వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం మహిళలు కలశాలతో వేదవతి హాజరు ప్రాంతంలోని గంగ ఇచ్చి గంగి పూజ నిర్వహించారు.అనంతరం గ్రామ పురవీధుల గుండా శ్రీ చిక్కనేశ్వర స్వామి దేవాలయానికి కలశాలతో ఊరేగింపుగా చేరుకుని స్వామివారికి అభిషేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం శ్రీ నిజ శరణ అంబిగర చౌడయ్య స్వామివారి ఫోటోను ట్రాక్టర్లపై ఉంచి, మంగళ వాయిద్యాల మధ్య దిగువగేరి నుంచి బస్టాండ్ వరకు కోలాహలంగా ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో గంగపుత్రలు, వారి కుటుంబీకులు, గ్రామస్థులు భారీ సంఖ్యలో పాల్గొని జయంతి వేడుకలను విజయవంతం చేశారు. భక్తుల జయజయధ్వానాలు, భజనలు, సాంప్రదాయ కార్యక్రమాలతో గ్రామం మొత్తం ఆధ్యాత్మిక వాతావరణంతో మేళవించింది.

# దళితులు బతకాలంలే తుపాకీ లైసెన్సులు కావాలేమో

**వైయస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి..**

**విజయవాడ (తెలుగోడు), జనవరి 25 :**
వైయస్సార్సీపీకి ఓటేస్తే, ఆ పార్టీకి అండగా నిలబడితే చంపేస్తాం అనేలా కూటమి నాయకులు రెచ్చిపోతున్నారని, స్వేచ్ఛగా ఓటేసినందుకు దళితులను ఊచకోత కోసి చంపుతున్నారని, హాయిగా బ్రతకాలంటే తుపాకులు కావాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని వైయస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకర్ అన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటేసే హక్కును కాలరాయాలని చూస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో మరింత ఉధృతంగా ఓటు అనే ఆయుధంతో దళితుల సత్తాని కూటమి ప్రభుత్వానికి రుచి చూపిస్తాం అన్నారు. వైయస్ జగన్ నేతృత్వంలోని వైయస్సార్సీపీని తిరిగి అధికారంలోకి తీసుకొస్తామన్నారు. దళితులను చంపితే అడిగే దిక్కు లేదని అనుకుంటున్నారని, ఉద్యమాల ద్వారా 41 శాతం ఉన్న దళితుల సత్తాని అధికార పార్టీకి రుచి చూపిస్తాం అన్నారు. దాడులపై కళ్యాణ్ స్పందించాలన్నారు. మందా సాల్మన్ హత్యను కోర్టులు సుమోటోగా స్వీకరించి ప్రభుత్వంపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

# ఉత్తమ డాటా ఎంట్రీ ఆపరేటర్ అవార్డుకు బస్తీ రవికుమార్ ఎంపిక

**ఎంఈఓ-2 చంద్రశేఖర్ నాయుడు..**

**అగళి (తెలుగోడు), జనవరి 25 :**
మండలంలోని ఎం ఆర్ సి కార్యాలయంలో డాటా ఎంట్రీ ఆపరేటర్గా విధులు నిర్వహిస్తున్న బస్తీ రవికుమార్ ఉత్తమ అవార్డు కు ఎంపికైనట్లు జిల్లా కలెక్టర్ ప్రకటించారని ఎంఈఓ -2 చంద్రశేఖర్ నాయుడు తెలిపారు.బస్తీ రవి కుమార్ విధుల్లో చూపిన అంకితభావం,నిజాయితీ చక్కనైన సేవలకు ఉత్తమ అవార్డు ను సోమవారం జిల్లా కేంద్రమైన పుట్టపర్తి లో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా జనవరి 26,2026 గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని అందుకోనున్నారు. ప్రజాసేవలో ఆయన చూపిన కృషి,విధుల పట్ల ఆయన చూపిన చొరవ పాత్ర ప్రశంసనీయ మైందని గుర్తించి ఈ అవార్డు ప్రదానం చేయనున్నారు. ఎంఈఓ -2 చంద్రశేఖర్ నాయుడు, తోటి సిబ్బంది ప్రజలు ఆయనకు శుభాకాంక్షలు అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎంఈఓ -2 చంద్రశేఖర్ నాయుడు మాట్లాడుతూ ఉత్తమ అవార్డుకు ఎంపికైన బస్తీ రవి కుమార్ భవిష్యత్తులో మరింత నిబద్ధతతో సేవలందించి,ఇలాంటి మరెన్నో అవార్డులను పొందాలని ఆకాంక్షించారు.



బస్తీ రవికుమార్



## నితిన్ 36కి గ్రీన్ సిగ్నల్

### వి.ఐ.ఆనంద్ దర్శకత్వంలో హై కాన్సెప్ట్ సైఫై ఎంటర్‌టైనర్
### రథ సప్తమి సందర్భంగా భారీ ప్రాజెక్ట్ ప్రకటన

టాలీవుడ్ యంగ్ హీరో నితిన్ తన 36వ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. విభిన్నమైన కథలు, వినూత్న కథనాలతో గుర్తింపు పొందిన దర్శకుడు వి.ఐ.ఆనంద్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కనుంది. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాస చిట్టూరి ఈ భారీ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. రథ సప్తమి శుభ సందర్భాన్ని పురస్కరించుకుని మేకర్స్ ఈ సినిమాను అధికారికంగా అనౌన్స్ చేస్తూ, ఇది హై కాన్సెప్ట్ సైఫై ఎంటర్?టైనర్ అని వెల్లడించారు.'ఊరు పేరు భైరవకోన' చిత్రంతో మరోసారి తన క్రియేటివ్ టచ్‌ను చాటిన వి.ఐ.ఆనంద్, ఇప్పుడు ఈ ప్రాజెక్ట్‌తో క్రియేటివ్ బౌండరీస్‌ను మరింత విస్తరించేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటివరకు తెలుగు ప్రేక్షకులు చూడని విధంగా కొత్త తరహా సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందించడమే లక్ష్యంగా ఈ సినిమా రూపుదిద్దుకోనుంది. సైన్స్ ఫిక్షన్ అంశాలను మాస్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో మేళవిస్తూ, థ్రిల్లింగ్ కథనంతో ప్రేక్షకులను కట్టిపడేయనున్నట్టు మేకర్స్ సంకేతాలు ఇచ్చారు.నితిన్ కెరీర్‌లోనే అత్యంత ఆసక్తికరమైన, క్రేజీ ప్రాజెక్ట్‌లలో ఒకటిగా ఈ సినిమా నిలవనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. కథ ఎంపికలో ఎప్పుడూ కొత్తదనం కోరుకునే నితిన్, ఈసారి పూర్తిగా డిఫరెంట్ జానర్‌లోకి అడుగుపెడుతూ అభిమానుల్లో భారీ అంచనాలు పెంచేశారు. త్వరలోనే షూటింగ్ ప్రారంభం కానుండగా, నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను కూడా మేకర్స్ త్వరలో ప్రకటించనున్నారు. సైఫై ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం, విజువల్ వండర్‌తో పాటు బలమైన కథ, ఆసక్తికరమైన కథనంతో తెలుగు సినిమా స్థాయిని మరో మెట్టు పైకి తీసుకెళ్లనుందని సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




## అట్లీ..లోకేష్ తర్వాత వంగా వార్..!



### 2028లో సందీప్ రెడ్డి వంగా చేతుల్లో అల్లు అర్జున్ 25వ సినిమా... పాన్ వరల్డ్ రచ్చకు కౌంట్ డౌన్ మొదలు..

గతేడాది పుష్ప సినిమాతో దేశవ్యాప్తంగా సెన్సేషన్ క్రియేట్ చేసిన ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రస్తుతం దర్శకుడు అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ వరల్డ్ మూవీలో నటిస్తున్న విషయం తెలిసిందే. అర్జున్ కెరీర్?లో 22వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ దశలో ఉండగానే తాజాగా మరో తమిళ స్టార్ డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్?తో తన 23వ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి సోషల్ మీడియాలో హాట్ టాపిక్?గా మారాడు. దీంతో రెండు రోజులుగా అల్లు అర్జున్ పేరు ట్రెండింగ్?లో దూసుకుపోతోంది.

ఇదిలా ఉండగానే అట్లీ, లోకేశ్ సినిమాల తర్వాత సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తో సినిమా ఫిక్స్ అయ్యిందన్న వార్త బయటకు రావడంతో అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఫ్యాన్స్ ఫుల్ జోష్?లోకి వెళ్లిపోయారు. అర్జున్ రెడ్డి సినిమాతో తెలుగు చిత్రసీమలో ఓవర్?నైట్ స్టార్ డైరెక్టర్?గా మారిన సందీప్ రెడ్డి వంగా, ఆ తర్వాత కబీర్ సింగ్తో నేషనల్ లెవల్?లో సంచలనం సృష్టించాడు. తాజాగా యానిమల్ సినిమాతో ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాడు. ప్రస్తుతం ప్రభాస్?తో స్పిరిట్ అనే పాన్ ఇండియా ప్రాజెక్ట్?ను తెరకెక్కిస్తూ బిజీగా ఉన్నాడు.

వాస్తవానికి అర్జున్ రెడ్డి సినిమాను మొదట అల్లు అర్జున్?తోనే చేయాలన్న ఆలోచన సందీప్?కు ఉన్నప్పటికీ, ఆ ప్రాజెక్ట్ చివరకు విజయ్ దేవరకొండ చేతికి వెళ్లి అతడికి స్టార్ స్టేటస్ తీసుకొచ్చింది. ఆ తర్వాత పలుమార్లు అల్లు అర్జున్?తో సినిమా తప్పకుండా ఉంటుందని సందీప్?తో పాటు టీ-సిరీస్ నిర్మాతలు చెబుతూ వచ్చారు. అయితే కాలక్రమంలో కొత్త అప్డేట్ లేకపోవడంతో ఆ కాంబినేషన్ ఆగిపోయిందన్న అభిప్రాయం ఏర్పడింది. పైగా యానిమల్ సక్సెస్ తర్వాత సందీప్ బాలీవుడ్ ప్రాజెక్ట్స్, సీక్వెల్స్?తో బిజీ కావడం, ప్రభాస్?తో స్పిరిట్ లైన్?లోకి రావడం వల్ల అల్లు అర్జున్ ప్రాజెక్ట్ మరుగున పడింది.

ఈ నేపథ్యంతో తాజాగా స్పిరిట్, యానిమల్ పార్క్ సినిమాలను నిర్మిస్తున్న టీ-సిరీస్ అధినేత భూషణ్ కుమార్ ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఓ మీడియా ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, ముందుగా ప్రభాస్?తో స్పిరిట్, ఆ తర్వాత యానిమల్ పార్క్ పూర్తయ్యాక అల్లు అర్జున్?తో సినిమా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సినిమా అల్లు అర్జున్ కెరీర్?లో 25వ సినిమాగా తెరకెక్కనుండటం విశేషం. అట్లీ, లోకేశ్ కనగరాజ్ సినిమాల అనంతరం, సుకుమార్?తో పుష్ప 3 పూర్తి చేసిన తర్వాత 2028లో ఈ చిత్రం పట్టాలెక్కే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి.

## మళ్లీ మ్యాజిక్ చేయబోతున్న మోహన్‌లాల్

మలయాళ చిత్రసీమలో సూపర్‌హిట్ కాంబినేషన్‌గా గుర్తింపు తెచ్చుకున్న స్టార్ హీరో మోహన్‌లాల్ మెగా దర్శకుడు ప్రియదర్శన్ మరోసారి కలిసి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. కామెడీ, ఫ్యామిలీ డ్రామా, భావోద్వేగ కథలతో ఎన్నో క్లాసిక్ చిత్రాలను అందించిన ఈ జంట ఇప్పుడు మరో ప్రతిష్ఠాత్మక సినిమాకు శ్రీకారం చుట్టింది. ఈ విషయాన్ని దర్శకుడు ప్రియదర్శన్ స్వయంగా వెల్లడించడం విశేషం.ఈ చిత్రం ప్రియదర్శన్ కెరీర్‌లో 100వ సినిమాగా నిలవనుంది. అంతేకాదు, ఆయన దర్శకుడిగా ప్రయాణం మొదలైన తొలి చిత్రం కూడా మోహన్‌లాల్ తోనే కావడం గమనార్హం. అందుకే తన కెరీర్‌లో తొలి చిత్రం, 100వ చిత్రం రెండూ మోహన్‌లాల్‌తోనే ఉండాలన్న గట్టి నిర్ణయానికి వచ్చానని ప్రియదర్శన్ తెలిపారు."నేను ఈ స్థాయికి చేరుకోవడంలో మోహన్‌లాల్ పాత్ర ఎంతో కీలకం. ఆయన లేకపోతే నా ప్రయాణం ఇలా ఉండేది కాదు. అందుకే నా 100వ సినిమాను ఆయనతోనే చేయాలని నిర్ణయించుకున్నాను" అంటూ ప్రియదర్శన్ భావోద్వేగంగా స్పందించారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌లో హీరోగా మోహన్‌లాల్‌ను ఎంపిక చేసినట్లు ఆయన అధికారికంగా ప్రకటించారు.

ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన కథా చర్చలు జోరుగా జరుగుతున్నాయి. ఈ ఏడాదిలోనే షూటింగ్ ప్రారంభం కానుందని సినీ వర్గాల సమాచారం. మలయాళంతో పాటు ఇతర భాషల్లోనూ ఈ చిత్రాన్ని విడుదల చేయాలన్న ఆలోచనలో చిత్రబృందం ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే ఈ కాంబినేషన్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. మళ్లీ తెరపై ఈ మ్యాజిక్ ఎలా ఉండబోతుందో చూడాలని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.